
మంగళవారం 26.05.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 34 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00



ప్రతి ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేయడమే సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ లక్ష్యం. చంద్రబాబు నాయకత్వంపై పెట్టుబడిదారుల్లో విశ్వాసం ఉంది. గూగుల్, రిలయన్స్, మిట్టల్ వంటి సంస్థలు రాష్ట్రం వైపు చూస్తుండగా, యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పన దిశగా ప్రభుత్వం వేగంగా ముందుకెళ్తోంది.

**ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ**



# పరిశ్రమలు పెట్టండి..

## ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందుకోండి



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటైన ఎంఎస్ఎంఈల ద్వారా తయారైన ఉత్పత్తులు ప్రపంచ విపణికి చేర్చేందుకు ప్రయత్నిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. దేశ ఆర్థిక వ్యవస్థకు ఊపిరిగా ఎంఎస్ఎంఈ రంగం ఉందని... భారీ పరిశ్రమలు దేశానికి ప్రతిష్ఠ తీసుకువస్తే.. సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమలు లక్షల మందికి జీవనోపాధిని కలిగిస్తాయని అన్నారు. విజయవాడలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళావేదికలో నిర్వహించిన ఎంఎస్ఎంఈ గ్రోత్ సమ్మిట్ 2026కు ముఖ్యమంత్రి హాజరయ్యారు. అంతకుముందు 4.4 ఎకరాల్లో 1.45 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన అంబేద్కర్ కళావేదికను ముఖ్యమంత్రి ప్రారంభించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఒకేసారి 1500 మంది హాజరై కార్యక్రమాలు నిర్వహించుకునేలా కన్వెషన్ సెంటర్ నిర్మించటం సంతోషమన్నారు. అమరావతిలోనూ ఈ తరహా కన్వెన్షన్ సెంటర్లను నిర్మించనున్నట్టు ముఖ్యమంత్రి వెల్లడించారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో రాష్ట్రంలో మరో ఐదు కన్వెన్షన్ సెంటర్లు నిర్మించనున్నట్టు సీఎం తెలిపారు. ఎంఎస్ఎంఈ గ్రోత్ సమ్మిట్ సందర్భంగా రాష్ట్రంలోని చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ప్రభుత్వం ఇస్తున్న వెసులుబాట్లను... చేయూతను ముఖ్యమంత్రి వివరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. "ఓ చిన్న ఆలోచనను పెద్ద పరిశ్రమగా మార్చే అవకాశం ఎంఎస్ఎంఈలకు మాత్రమే ఉంది. యువత కలలకు, మహిళ ఆత్మవిశ్వాసానికి ప్రతీకగా ఉన్న ఈ రంగం వ్యవసాయం తర్వాత మిగతా 2లో...

- ఆంధ్రప్రదేశ్ చీఫ్ మినిస్టర్స్ ఎంట్రప్రెన్యూర్ ప్రోగ్రామ్ కింద రూ.300 కోట్లు
- ప్రపంచ విపణికి సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమల ఉత్పత్తులు
- సైనింగ్- గ్రౌండింగ్- ఓపెనింగ్ విధానాన్ని అమలు చేస్తున్న ప్రభుత్వం
- 38 ఎంఎస్ఎంఈ పారిశ్రామిక పార్కులకు వర్చువల్ గా శంకుస్థాపన
- రూ.200 కోట్లతో ఏపీ క్లస్టర్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ ప్రారంభించిన సీఎం
- జెన్ -జీ కలల సాకారానికి కార్యాచరణ
- ఎంస్ఎంఈ గ్రోత్ సమ్మిట్ 2026లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- విజయవాడలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళావేదిక ప్రారంభించిన ముఖ్యమంత్రి



## మెటా, అమెజాన్, జోహో సంస్థలతో కీలక ఒప్పందాలు



- ఎంఎస్ఎంఈ గ్రోత్ సమ్మిట్ 2026లోఎంఓయూలు
- స్టార్టప్ లకు కియా సహకారం, డీప్ టెక్ కు రూ.20 కోట్ల సిడ్బీ సీడ్ ఫండ్
- ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ఎంఎస్ఎంఈ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఒప్పందాలు

2లో

## రూ.33,660 కోట్లతో "భవ్య" పథకం ప్రారంభం



- 100 ప్లగ్-అండ్-ప్లే పార్కులతో పారిశ్రామికీకరణకు ఊతం
- 15 లక్షల మందికి ఉపాధి అవకాశాలు
- ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీయన్ మాధవ్

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశ పారిశ్రామికాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోందని, దేశీయ ఉత్పాదక రంగాన్ని బలోపేతం చేయడం మరియు ప్రపంచ స్థాయి పారిశ్రామిక మౌలిక వసతులను అభివృద్ధి చేయడం లక్ష్యంగా రూ. 33,660 కోట్ల వ్యయంతో "భారత్ ఔద్యోగిక్ వికాస్ యోజన (భవ్య)" పథకాన్ని ప్రారంభించడం హర్షణీయమని ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీయన్ మాధవ్ పేర్కొన్నారు. మిగతా 3లో...

## పేదల సేవలో ఏపీనే నెంబర్-1



- పెన్షన్ల పంపిణీలో దేశంలో అగ్రభాగాన నిలిచిన కూటమి ప్రభుత్వం
- 2 ఏళ్ల పాలనలో సుమారు రూ. 65 వేల కోట్లకు పైగా పెన్షన్ల పంపిణీ
- ఐదేళ్లల్లో గత ప్రభుత్వం ఖర్చు పెట్టిన మొత్తంలో 71.5 శాతాన్ని 2 ఏళ్లల్లోనే పంపిణీ చేసిన కూటమి సర్కార్
- రూ. 4000 నుంచి రూ. 15000 వరకు వివిధ వర్గాలకు పెన్షన్లు అందజేత
- దివ్యాంగులకు రెండింతల లబ్ది చేకూర్చిన కూటమి సర్కార్
- రికార్డు స్థాయి పెన్షన్ల పంపిణీతో సామాజిక విప్లవం సృష్టించిన ఏపీ
- ప్రతి నెలా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో క్రమం తప్పకుండా పాల్గొంటున్న ముఖ్యమంత్రి మిగతా 2లో...

## ప్రజలకు సులభతర ప్రభుత్వ సేవలు

- ప్రభుత్వ సేవల వేగవంతానికి బిజినెస్ రూల్స్ మారాలి
- టెక్నాలజీ అందుబాటులోకి వచ్చింది... నిబంధనల పేరుతో జాప్యం సరికాదు
- ఆర్టీజీఎస్ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

2లో

## ఆర్థిక కార్యకలాపాల కేంద్రంగా కోస్తాంధ్ర తీరం


- ఏపీలో సముద్ర తీరం అభివృద్ధికి విజన్ ప్లాన్
- సముద్ర సంపద అందిపుచ్చుకునేలా కార్యాచరణ
- తీరప్రాంతం కోతకు గురి కాకుండా రక్షణ చర్యలు
- సముద్రతీర అభివృద్ధిపై నిపుణులతో సీఎం చంద్రబాబు సమావేశం

## గోదావరి కాలుష్య నివారణకు రూ.100కోట్లు



- ఆరు నెలల్లో నదిలో మార్పు కనిపించాలి
- అంతర్ శాఖల (జిల్లా) టాస్క్ ఫోర్స్ ఏర్పాటు
- దేశం గర్వపడేలా ప్లాస్టిక్ రహిత పుష్కరాలు నిర్వహిద్దాం
- గోదావరి నది కాలుష్యం, పుష్కరాల సన్నద్ధతపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సమీక్ష సమావేశం

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** 'మన దాహం తీర్చి, మనకు జీవితాన్ని ఇచ్చే పవిత్రమైన జీవ నదులను మనమే చేతులారా చంపేస్తూ, వాటిని మృత నదులుగా మారుస్తున్నామ'ని ఉప ముఖ్యమంత్రి, పర్యావరణ, అటవీ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. నదుల పట్ల మనకున్న నిర్లక్ష్యం ఇలాగే కొనసాగితే భవిష్యత్తు తరాలకు తాగు నీరు దొరకడమే చాలా కష్టమవుతుందని హెచ్చరించారు. భగవంతుడు ప్రసాదించిన నీటిని ఇష్టారాజ్యంగా కలుషితం చేస్తూ, మళ్లీ అదే తాగునీటి కోసం జలజీవన్ మిషన్ అంటూ కోట్ల రూపాయలు ఖర్చు పెట్టే విచిత్ర పరిస్థితికి స్వస్తి చెప్పాలన్నారు. గోదావరి పరివాహక ప్రాంతాల్లోని కాలుష్యాన్ని నివారించడానికి ప్రత్యేకంగా అంతర్ జిల్లా టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. మిగతా 3లో...



## నేడు ఏఐ ఆధారిత ఆరోగ్య వ్యవస్థ భాగస్వాముల సదస్సు

- 'మెడ్‌టెక్ ఛాలెంజ్ గ్రాండ్' విజేతల ఎంపిక కూడా...

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఏఐ ఆధారిత ఆరోగ్య వ్యవస్థ–వ్యూహాత్మక భాగస్వాముల సదస్సు, ' మెడ్ టెక్ ఛాలెంజ్ గ్రాండ్ 'ఫైనల్ కార్యక్రమం మంగళవారం మంగళగిరిలోని 'జరగబోతుంది. ఆరోగ్య రంగంలో రకరకాల కార్యకలాపాలు నిర్వహిస్తున్న అంకుర సంస్థలు, ఏజెన్సీల ముఖ్య ప్రతినిధులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారులు, ఇతర రంగాలకు చెందిన వారు కలిపి సుమారు 300 మంది ఈ సదస్సు, మెడ్ టెక్ ఛాలెంజ్ గ్రాండ్ ఫైనల్ కార్యక్రమానికి హాజరుకాబోతున్నారు. ప్రభుత్వాసుపత్రు ల్లో ఏఐ ఆధారిత సేవలు అందించిన అంకుర సంస్థల ప్రతినిధులు తమ అనుభవాలను ఈ సదస్సులో 'డెమో' ద్వారా సభికులకు వివరించనున్నారు. మెడ్ టెక్ ఛాలెంజ్ గ్రాండ్ లో విజేతలుగా నిలిచే అంకుర సంస్థలకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ నగదు పారితోషికాలు అందచేస్తారు. మిగతా 3లో...

## త్వరలో ఎక్సైజ్ రంగంలో సంస్కరణలు

- ఎక్సైజ్ విధానాలపై మంత్రివర్గ ఉపసంఘం సమీక్ష
- మద్యం విధానం, బీరు సరఫరాపై కీలక చర్చలు




**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖకు సంబంధించిన కీలక విధానాలు, ఆదాయ వృద్ధి చర్యలు, భవిష్యత్ కార్యాచరణపై సోమవారం మిశ్రిత విధానంలో మంత్రివర్గ ఉపసంఘం సమావేశం నిర్వహించారు. మిగతా 3లో...

## ఎంఎస్ఎంఈతో ఏపీలో పారిశ్రామిక విప్లవం

- ఎంఎస్ఎంఈ గ్రోత్ సమ్మిట్ 2026లో మంత్రి కొండపల్లి



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** ఎంఎస్ఎంఈతో ఏపీలో సరికొత్త ఔత్సాహిక, సరికొత్త పారిశ్రామిక విప్లవానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాంది పలికారని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. మిగతా 3లో...

## గుంటూరు మెడికల్ కాలేజీకి అపూర్వ గౌరవం

### ఒకే విద్యాసంస్థ నుంచి ఎనిమిది మంది పద్మశ్రీ అవార్డు గ్రహీతలు




**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** దేశంలో ఎన్నో వైద్య కళాశాలలు ఉన్నప్పటికీ,వైద్య విద్యలో గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాల మరోసారి తన ప్రత్యేకతను చాటుకుంది. 1946లో స్థాపించబడిన ఈ ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థ నుంచి చదువుకున్న ఎనిమిది మంది వైద్య నిపుణులు దేశ నాలుగో అత్యున్నత పౌర పురస్కారం 'పద్మశ్రీ' అందుకోవడం విశేషంగా నిలిచింది. వైద్య సేవలు, పరిశోధనలు, శస్త్రచికిత్సలు, ప్రజారోగ్య రంగాల్లో విశిష్టకృషి చేసిన ఈ ప్రముఖులు గుంటూరు మెడికల్ కాలేజీ ఖ్యాతిని దేశవ్యాప్తంగా చాటిచెప్పారు. ఇక్కడ చదివిన వైద్య నిపుణులు దేశ, విదేశాల్లో విశిష్ట సేవలు అందించడమే కాకుండా, వైద్య రంగంలో చేసిన అసాధారణ కృషికి గాను దేశ అత్యున్నత పౌర పురస్కారాల్లో ఒకటైన పద్మశ్రీలను అందుకోవడం కళాశాల ప్రతిష్ఠను మరింత పెంచింది. ఒకే మెడికల్ కాలేజీ నుంచి ఇంత పెద్ద సంఖ్యలో పద్మ పురస్కార గ్రహీతలు రావడం అరుదైన విషయంగా వైద్య వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

**ఎనిమిది దశాబ్దాల వైద్య వారసత్వం :** 1946లో స్థాపించబడిన గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాల దాదాపు 80 ఏళ్లుగా వైద్య విద్యలో విశిష్ట సేవలు అందిస్తోంది. ఈ విద్యాసంస్థ నుంచి పట్టభద్రులైన అనేక మంది వైద్యులు దేశ విదేశాల్లో కీలక స్థానాల్లో సేవలందిస్తూ పేరు ప్రఖ్యాతలు తెచ్చుకున్నారు. వైద్య రంగంలో విశేష సేవలకు గుర్తింపుగా ఎనిమిది మంది పూర్వ విద్యార్థులు పద్మశ్రీ పురస్కారాలను అందుకోవడం కళాశాల ప్రతిష్ఠను మరింత పెంచింది.

**వైద్య రంగంలో చెరగని ముద్ర :** గ్యాస్ట్రోఎంటరాలజీ, స్టెమ్ సెల్ పరిశోధనల్లో కీలక కృషి చేసిన డా. సీఎం హబీబుల్లా వైద్య పరిశోధనల్లో ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆయనకు 2001లో పద్మశ్రీ పురస్కారం లభించింది.

హృద్రోగ వైద్య నిపుణుడు డా. బీ సోమరాజు, మిగతా 2లో...

## “ప్రజలకు సులభతర ప్రభుత్వ సేవలు”



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :**టెక్నాలజీ పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చిందని... ప్రజలకు ప్రభుత్వ సేవలు సులభంగా అందేలా ఉండాలి కానీ.. నిబంధనలు అడ్డుకాకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సులభంగా అందే విధంగా చూడాలని... ఈ మేరకు అవసరమైన మేరకు బిజినెస్ రూల్స్ సవరించాలన్నారు. బిజినెస్ రూల్స్ సవరించాలని గతంలోనే అనుకున్నామని... దానికి సంబంధించిన కార్యాచరణ సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. సోమవారం క్యాంప్ కార్యాలయంలో ఆర్టీజీఎస్ పనితీరుతో పాటు.. వివిధ శాఖల కార్యక్రమాలు క్షేత్ర స్థాయిలో అమలవుతున్న తీరుపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ...”ప్రజల కోసం అధికారులు.. ఉద్యోగులు, క్షేత్ర స్థాయి సిబ్బంది పని చేయడం ఎంత ముఖ్యమో... దానికి అనుగుణంగా ఫలితాలు చూపించడం కూడా అంతే ముఖ్యం. క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ పథకాల అమలు, ప్రభుత్వం అందిస్తున్న సేవలపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తున్నాం. ఆ సమాచారం ఆధారంగా అధికారులు, ఉద్యోగుల పనితీరును అంచనా వేయాలి. బాగా పని చేస్తున్న అధికారులను అభినందిద్దాం.. సరిగా పని చేయని అధికారులకు ఓరియేంటేషన్ క్లాసులు తీసుకుందాం. రోటీన్ పద్దతుల్లో పని చేయడం కాకుండా... వినూత్నంగా ఆలోచన చేయాలి.. సేవలను సులభతరం చేయాలి. రోటీన్ పద్దతుల్లో చేసే పని విధానానికి కాలం చెల్లింది. ప్రతి నియోజకవర్గానికి ప్రణాళిక శాఖ నుంచి నోడల్ అధికారులను నియమించాం. వారి సేవలను పూర్తిగా వినియోగించుకోవాలి. ప్రజలకు సేవలను త్వరితగతిన చేరవేసేందుకు బిజినెస్ రూల్స్ మార్చాలని గతంలోనే అనుకున్నాం. దీనికి సంబంధించిన కార్యాచరణను సిద్ధం చేయాలి.” అని సీఎం ఆదేశించారు.

**కన్విన్స్ చేయాలి... సమస్యలు పరిష్కరించాలి :** “రెవెన్యూ సంబంధిత సమస్యల పరిష్కారంపై మరింత శ్రద్ధ పెట్టాలి. ఏడాదిలోగా రెవెన్యూ సమస్యలను తీరుస్తామని హామీ ఇచ్చాం. నిర్దేశించుకున్న ఏడాది గడువులో ఇప్పటికే కొంత కాలం ముగిసింది. పరిష్కారం కానీ సమస్యలపై ఫోకస్ పెట్టండి. ముఖ్యంగా కుటుంబ తగాదాలతో ఉత్పన్నయ్యే రెవెన్యూ సమస్యల పరిష్కారానికి సంబంధిత వ్యక్తులతో అధికారులు, ఉద్యోగులు మాట్లాడాలి. వారిని కన్విన్స్ చేయాలి. గొడవలు పడితే నష్టమే తప్ప.. లాభం ఉండదని వివరించాలి. వీలైనంత మేరకు సమస్యను పరిష్కరించేందుకు మానవీయ కోణంలో ఆలోచించి పని చేయాలి. ఇక కుల ధృవీకరణ పత్రాల జారీలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలి... ఆన్ లైన్లోనే డౌన్లోడ్ చేసుకునే వెసులుబాటు కల్పించేలా చూడాలి. అన్ని స్థాయిల్లోని ఆస్పత్రుల్లో సేవలందించే విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం చేయవద్దు. ఆర్టీజీఎస్ విభాగానికి అన్ని శాఖల సమాచారం పూర్తిగా అందించాలి... దీన్ని సమన్వయం చేసుకునేలా ప్రతి శాఖ నుంచి ఓ అధికారిని డిజిగ్నేట్ చేయాలి. సైబర్ ఫ్రాడ్స్ అరికట్టేలా పటిష్ట వ్యవస్థను ఏర్పాటు చేయాలి.”అని ముఖ్యమంత్రి సూచించారు. ఈ సమీక్షలో సీఎస్ సాయి ప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఆర్థిక కార్యకలాపాల కేంద్రంగా కోస్తాంధ్ర తీరం



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ లోని సముద్ర తీరం అభివృద్ధికి సమగ్ర విజన్ ప్లాన్ తయారు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఆర్థిక కార్యకలాపాల కేంద్రంగా కోస్తాంధ్ర తీరం మారేలా ఈ ప్రణాళికలు ఉండాలని సీఎం సూచించారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో సముద్ర తీర అభివృద్ధికి సంబంధించి నిపుణులు, అధికారులతో సీఎం సమావేశం అయ్యారు. ఏపీలో ఉన్న వెయ్యి కిలోమీటర్ల సుదీర్ఘ తీర ప్రాంతంలో అభివృద్ధి ప్రాజెక్టులు, పెట్టుబడులు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, మత్స్యకారులకు కలిగే ప్రయోజనాలపై పూర్తి స్థాయి అధ్యయనం నిర్వహించాలని సీఎం స్పష్టం చేశారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా బ్లూ ఎకానమీలో భాగంగా సముద్ర ఆర్థిక వ్యవస్థ గురించే చర్చ జరుగుతోందని.. అపారమైన వనరుల్ని వెలికి తీస్తే విస్తృత ప్రయోజనాలు దక్కే అవకాశం ఉందని ముఖ్యమంత్రి అన్నారు. ఏపీలో ఆక్వా కల్చర్ అభివృద్ధి చేశామని.. రొయ్యలు, చేపల సాగు, ఎగుమతుల్లో ఏపీ నెంబర్ వన్ స్థానంలో ఉందన్నారు. ఆక్వా కల్చర్ లో వాల్యూ అడిషన్ జరగాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. దీంతో పాటు ఆక్వా వ్యర్థాలు కాలుష్య కారకంగా మారి పర్యావరణానికి హాని కలిగిస్తున్నాయని అన్నారు. ఈ సవాళ్లను పరిష్కరించేలా పూర్తి స్థాయి అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. అలాగే మెరైన్ బయోడైవర్సిటీని కాపాడేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. సముద్రాలతో పాటు తీరప్రాంతాల్లో దొరికే రేర్ ఎర్త్ మినరల్స్ పై కూడా ఇప్పుడు ప్రత్యేకంగా దృష్టి పెట్టామని.. ఆ వనరుల్ని అందిపుచ్చు కోవాలన్నారు. తీరప్రాంత రక్షణ పైనా ప్రత్యేకంగా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి అన్నారు. తుపాన్ల లాంటి ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునేలా సముద్ర తీరాల్లో మడ అడవులు, తాటి చెట్లు లాంటి మూడంచెల సహజ రక్షణ కవచం ఏర్పాటు చేసేలా చూడాలని స్పష్టం చేశారు. పర్యావరణ అనుకూల విధానాలతో పాటు పర్యాటకం, ఆర్థిక కార్యకలాపాల కేంద్రంగా సముద్ర తీరప్రాంతాలు తయారు కావాలని సీఎం దిశానిర్దేశం చేశారు. అలాగే సీ వీడ్ అభివృద్ధి, మార్కెటింగ్ లాంటి అంశాలపై కూడా పరిశీలించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్, మత్స్యశాఖ కమిషనర్ నాయక్, రైతు సాధికార సంస్థ వైస్ ఛైర్మన్ విజయ్ కుమార్, మెరైన్ డైవర్సిటీ సంస్థ వోయసీ సంస్థ ప్రతినిధి ఫిలిప్ తదితరులు హాజరయ్యారు.

## ఇంద్రకీలాద్రి ఘాట్ రోడ్డుకు తాత్కాలిక మూసివేత

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :**ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన శ్రీ కనకదుర్గమ్మ ఆలయ ఘాట్ రోడ్డును తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు దేవస్థానం ఉన్నతాధికారులు వెల్లడించారు. అత్యవసర మరమ్మతు పనుల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. మంగళవారం నుంచి ఆంక్షలు అమల్లోకి వస్తాయని స్పష్టం చేశారు.

మే 26వ తేదీ నుంచి జూన్ 12వ తేదీ వరకు ఘాట్ రోడ్డును పూర్తిగా మూసివేస్తామని అధికారులు పేర్కొన్నారు. ఈ కాలంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.

అమ్మవారి దర్శనం కోసం భక్తులు కనకదుర్గ నగర్ మార్గం (బ్రాహ్మణ వీధి) ద్వారా కొండపైకి చేరుకోవచ్చని సూచించారు. అలాగే మెట్ల మార్గం లేదా లిఫ్ట్ సౌకర్యాన్ని కూడా వినియోగించుకోవచ్చని తెలిపారు.

# పరిశ్రమలు పెట్టండి... ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందుకోండి

(మొదటి పేజీ తరువాయి)

ఎక్కువ ఉద్యోగాలు కల్పిస్తోంది. ఏపీలో వనరులకు, అవకాశాలకు కొదవలేదు. వీటిని వినియోగించుకునేలా ఎంఎస్ఎంఈలకు అవకాశాలు కల్పిస్తున్నాం. పోర్టులు, ఎయిర్ పోర్టులు, హైవేలు, రైల్వే లాంటి లాజిస్టిక్స్ కూడా ఏపీలో అందుబాటులో ఉన్నాయి. రాష్ట్రంలో ఎంఎస్ఎంఈ, ఎంట్రప్రెన్యూర్ డెవలప్మెంట్ పాలసీ, ప్రైవేటు పారిశ్రామిక పార్కుల పాలసీలు తెచ్చి ఈ రంగాన్ని ప్రోత్సహిస్తున్నాం. ఎంఎస్ఎంఈ సమ్మిట్ కొత్త ఆవిష్కరణలకు వేదిక కావాలి. కొత్త పరిశ్రమలకు శ్రీకారం చుట్టాలి. పారిశ్రామిక యూనిట్లను పెద్ద ఎత్తున ఏర్పాటు చేసే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రతీ నియోజకవర్గంలోనూ 175 ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటికే 100 పార్కులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు జరిగాయి. ఇవాళ మరో 38 ఎంఎస్ఎంఈ పార్కులకు శంకుస్థాపన చేశాం. త్వరలో ఈ 138 పారిశ్రామిక పార్కులు సిద్ధం అవుతాయి. మిగిలిన వాటిని జూలై నాటికి శంకుస్థాపనలు చేసి అన్ని మౌలిక వసతులూ కల్పిస్తాం. ఈ పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు భూములిచ్చిన రైతులకు ధన్యవాదాలు.”అని ముఖ్యమంత్రి అన్నారు.

**ఏపీ.సీఎం.ఈజీపీకు రూ. 300 కోట్లు :** “ఈ సమ్మిట్ ద్వారా స్టార్టప్ కంపెనీలు, పారిశ్రామిక సంస్థలు, నిపుణులు, బ్యాంకులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, లబ్దిదారులు ఒకే వేదికపైకి వచ్చారు. వన్ ఫ్యామిలీ – వన్ ఎంట్రప్రెన్యూర్ కింద పెద్ద ఎత్తున పారిశ్రామిక యూనిట్లు ఏర్పాటు కావాలి. రాష్ట్రంలో 20.77 లక్షల ఎంఎస్ఎంఈ యూనిట్లు ఉన్నాయి. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ. 558 కోట్ల ప్రోత్సాహకాలు ఇచ్చాం. పీఎంఈజీపీ, క్రెడిట్ గ్యారంటీ స్కీమ్, పీఎం విశ్వకర్మ లాంటి కేంద్ర ప్రభుత్వ పథకాలను సమన్వయం చేస్తూ ఎంఎస్ఎంఈలను ప్రోత్సహిస్తున్నాం. వీటితో పాటు ఆంధ్రప్రదేశ్ చీఫ్ మినిస్టర్స్ ఎంట్రప్రెన్యూర్ ప్రోగ్రామ్ కింద



రూ. 300 కోట్లను కేటాయిస్తున్నాం. రూ. 200 కోట్లతో ఏపీ క్లస్టర్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ ప్రారంభిస్తున్నాం. ఏపీఐఐసీలో ఎంఎస్ఎంఈ యూనిట్లు స్థాపించే ఎస్సీ,ఎస్టీలకు ప్రత్యేక రాయితీలు ఇస్తున్నాం. 2024 జూన్ నుంచి ఇప్పటి వరకూ 2953 ఎంఎస్ఎంఈ యూనిట్లు ఏర్పాటు అయ్యాయి. వీటి ద్వారా రూ. 4.68 లక్షల కోట్ల పెట్టుబడులు సమకూరాయి. ప్రైవేటు పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చిన వారికి ప్రోత్సాహకాలు అందిస్తాం. ప్రైవేటు రంగంలో శ్రీసిటీ ఓ విజయవంతమైన పారిశ్రామిక పార్కు.” అని ముఖ్యమంత్రి అన్నారు.

**ఏపీ నుంచి 100 యూనికార్న్ కంపెనీలు లక్ష్యం :** “రాష్ట్రంలో మహిళలను వ్యాపారవేత్తలుగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. త్వరలో 5 లక్షల మంది డ్వాక్రా మహిళల్ని ఎంట్రప్రెన్యూర్లుగా తీర్చిదిద్దుతామని ... మహిళా సంఘాల వద్ద ప్రస్తుతం రూ. 28 వేల కోట్ల కార్పస్ ఉంది. ఏపీ నుంచి 100 యూనికార్న్ కంపెనీలు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా స్టార్టప్ కంపెనీలను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఏపీని ఇన్నోవేషన్ డ్రివెన్ ఎకానమీగా తీర్చిదిద్దే లక్ష్యంతో పనిచేస్తున్నాం. విలేజ్ టు గ్లోబల్ మార్కెట్ అనేది ప్రభుత్వ నినాదం. గ్రామీణ ప్రాంతాలకు టెక్నాలజీ తీసుకువెళ్లాలనే లక్ష్యంతో స్మార్ట్ విలేజ్ సెంటర్లను ప్రారంభిస్తున్నాం. ఓ పరిశ్రమ వ్యర్థాలు మరో పరిశ్రమకు ముడి సరుకుగా మారుతుంది. సర్క్యులర్ ఎకానమీపై ఎంఎస్ఎంఈలు దృష్టి పెట్టాలి. ఎంఎస్ఎంఈలు ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించాలన్న లక్ష్యంతో మెటా, అమెజాన్, జోహో లాంటి సంస్థలతో ఒప్పందం కుదుర్చుకున్నాం.”అని ముఖ్యమంత్రి తెలిపారు.

**జెన్ జీ వర్గం యువత కలల్ని సాకారం చేస్తాం :** “మెటా, అమెజాన్ లాంటి సంస్థలతో కుదుర్చుకున్న ఒప్పందాలు యువత భవిష్యత్తుకు ఉపాధికి, నైపుణ్యాలకు కొత్త దారుల్ని సృష్టిస్తాయి. మారుతున్న టెక్నాలజీ... ఉద్యోగాల స్వరూపాన్ని మారుస్తోంది. అందుకే టెక్నాలజీ స్కిల్ బిజినెస్ ఇంటిగ్రేషన్ మోడల్ ను అనుసరిస్తున్నాం. పరిశ్రమలకు అనువైన స్కిల్ డెవలప్మెంట్ పై దృష్టి పెట్టాం. ఆధునిక టెక్నాలజీ ఎకోసిస్టమ్ ద్వారా రాష్ట్ర యువతకు గ్లోబల్ స్థాయిలో అవకాశాలు అందుబాటులోకి వస్తాయి. ఏఐ, మెటలర్జీ, లాజిస్టిక్స్, క్లీన్ ఎనర్జీ ఏవియేషన్ లాంటి ఫంక్షనల్ యూనివర్సిటీలు ఏర్పాటు చేస్తున్నాం... పరిశ్రమలకు నైపుణ్యాలు అందించే కేంద్రాలుగా ఇవి మారబోతున్నాయి. జెన్– జీ, జెన్– ఆల్ఫా, టీనేజర్లకు మేలు కలిగేలా... వారి భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. టెక్నాలజీతో పాటు ఆధ్యాత్మికత కూడా కీలకమైన అంశం. యువశక్తి, టెక్నాలజీ, పరిశ్రమల భాగస్వామ్యంతో స్వర్ణాంధ్ర లక్ష్యాన్ని సాధిస్తాం. విశాఖ, అమరావతి, తిరుపతి ఎకనామిక్ రీజియన్లతో ఏపీ అభివృద్ధి చేస్తున్నాం. ప్రతీ రంగంలోనూ ఎంఎస్ఎంఈలు పెట్టుబడులు పెట్టేందుకు ఆస్కారం ఉంది. ప్రధాని మోదీ ఇచ్చిన చిప్ టు షిప్ అన్న నినాదాన్ని నిజం చేసేలా తయారీ రంగంపై దృష్టి పెట్టాం. సైనింగ్, గ్రౌండింగ్, ఓపెనింగ్ అన్నది ప్రభుత్వ విధానం.”అని ముఖ్యమంత్రి వెల్లడించారు. కార్యక్రమంలో భాగంగా సీఎం సమక్షంలో మెటా, అమెజాన్, జోహో సహా వివిధ సంస్థలతో ఏపీ ఎంఎస్ఎంఈడీసీ ఒప్పందం కుదుర్చుకుంది. డీప్ టెక్ స్టార్టప్ కంపెనీలకు రూ. 20 కోట్ల కార్పస్ ఫండ్ ఏర్పాటు చేసేందుకు సిడ్బీ ముందుకు వచ్చింది.

ఈ మేరకు ఒప్పందం చేసుకుంది. ఎంఎస్ఎంఈ గ్రోత్ సమ్మిట్లో భాగంగా ఏర్పాటు చేసిన స్టాళ్లను సీఎం సందర్శించారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ నేతృత్వంలోని స్టార్టప్ కంపెనీలు తయారు చేసిన టెక్నాలజీ ఎనేబుల్డ్ హ్యాండ్ ఇతర ఐటీ, టెక్ ఉత్పత్తులు, డిఫెన్స్ ఉత్పత్తులు, బీ.హెచ్.ఈ.ఎల్ తయారు చేసిన ఎలక్ట్రికల్ ఉత్పత్తులు, ప్రైవేట్ సంస్థలు రూపొందించిన డ్రోన్ బోట్లు, వివిధ రకాల గిరిజన ఉత్పత్తులను సీఎం తిలకించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, టీజీ భరత్, డోలా బాలవీరాంజనేయ స్వామి, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు తదితర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## మెటా, అమెజాన్, జోహో సంస్థలతో కీలక ఒప్పందాలు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :**ఎంఎస్ఎంఈ గ్రోత్ సమ్మిట్ 2026 ఏపీ సూక్ష్మ, చిన్న మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి కార్పొరేషన్ కీలకమైన ఒప్పందాలు కుదుర్చుకుంది.

కొత్తగా 38 ఎంఎస్ఎంఈ పార్కులకు ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. అనంతరం రాష్ట్రంలో స్టార్టప్ లు, ఎంఎస్ఎంఈల ప్రోత్సాహానికి గాను వివిధ సంస్థలు ముఖ్యమంత్రి సమక్షంలో ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఆర్టీఐహెచ్ ఆధ్వర్యంలో నడిచే రూరల్ అవుట్ పోస్టులను కూడా సీఎం ఆవిష్కరించారు. మంగళగిరి, పిఠాపురం, కుప్పంలో రుటాగ్ ఈ స్మార్ట్ విలేజ్ సెంటర్లను పైలట్ గా ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంక్యుబేషన్ కేంద్రాలుగా ఈ ఆర్ఎస్వీ కేంద్రాలు పనిచేయనున్నాయి. ఆర్టీఐహెచ్ తో కలిసి కియా ఇండియా సంస్థ అడ్వాన్స్ ప్రోటో టైపింగ్ ఇన్నోవేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది. వివిధ స్టార్టప్ లకు చేయూత ఇచ్చేలా హై ఎండ్ ప్రెసిషన్ మాన్యుఫాక్చరింగ్ ప్రోటోటైపింగ్ ఫెసిలిటీని కియా ఏర్పాటు చేయనుంది. డీప్ టెక్ స్టార్టప్ లకు ఆర్థిక సహకారం అందించేలా ఆర్టీఐహెచ్ తో కలిసి సిడ్బీ రూ. 20 కోట్ల సీడ్ ఫండ్ ప్రోగ్రామ్ ను కూడా ప్రారంభించనుంది. దీనికి సంబంధించి సిడ్బీ బ్యాంక్ ముందుకు వచ్చింది. రాష్ట్రంలో 1 లక్ష మంది ఎంఎస్ఎంఈ డిజిటల్ మెచ్యూరిటీ అసెస్మెంట్ లో భాగంగా వివిధ కళాశాలల్లో 50 డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్ ఫెసిలిటేషన్ సెంటర్లను ఏర్పాటు చేసేందుకు ఎంఎస్ఎంఈ డెవలప్మెంట్ కార్పొరేషన్ – ఐటీ శాఖల మధ్య ఒప్పందం కుదిరింది. వీటితో పాటు వెయ్యి ఎంఎస్ఎంఈ ఎనర్జీ, వాటర్ ఆడిట్స్, ఎంఎస్ఎంఈ క్లస్టర్స్ లో



డయాగ్నొస్టిక్స్ నిర్వహించేందుకు ఎస్సెల్ సంస్థ ఒప్పందం చేసుకుంది. రాష్ట్రంలోని 750 ఎంఎస్ఎంఈలతో పాటు 3,125 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించేలా రూ. 200 కోట్ల వ్యయంతో క్లస్టర్ డెవలప్మెంట్ ప్రోగ్రాం చేపట్టాలని నిర్ణయించారు. దివ్యాంగ యువతకు ఎంట్రప్రెన్యూర్ షిప్ ట్రైనింగ్ ఇచ్చేలా కార్యాచరణ చేపట్టనున్నారు.

**అంతర్జాతీయ మార్కెట్లకు ఎంస్ఎంఈ ఉత్పత్తులు :** రాష్ట్రంలోని 10 ఎంఎస్ఎంఈ క్లస్టర్లలో ఆయా రంగాల్లో జరిగే వృద్ధిని అధ్యయనం చేసేందుకు ఇండియా ఎస్ఎంఈ ఫోరంతో ఎంఎస్ఎంఈ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఒప్పందం చేసుకుంది. 1 లక్ష ఎంఎస్ఎంఈలకు టెక్నాలజీ అడాప్షన్ తో పాటు డిజిటల్ రెడీనెస్ పై శిక్షణ కోసం వోడా ఫోన్ ఐడియా బిజినెస్ తో ఒప్పందం కుదిరింది. ఎంఎస్ఎంఈల్లో డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్ కోసం జోహో సంస్థతోనూ ఒప్పందం కుదుర్చుకుంది. రాష్ట్రంలో ఎంఎస్ఎంఈలు తయారు చేసిన ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్లలో విక్రయాలకు, ఎగుమతులకు చేయూతనిచ్చేలా అమెజాన్ గ్లోబల్ సెల్లింగ్ తో ఒప్పందం కుదిరింది.

లాజిస్టిక్స్ సపోర్టుతో పాటు క్రాస్ బోర్డర్ ట్రేడ్, ఎగుమతుల సామర్థ్యం పెంచేలా ఆరామెక్స్ సంస్థ ముందుకు వచ్చింది. ఈమేరకు ఎంఎస్ఎంఈ డెవలప్మెంట్ కార్పొరేషన్ తో ఒప్పందం కుదుర్చుకుంది. 1 లక్షమంది మైక్రో ఎంటర్ ప్రైజెస్ సామర్థ్యాలను పెంచేలా మెటా సంస్థ చేయూత అందించేందుకు ఒప్పందం చేసుకుంది. తయారవుతున్న ఉత్పత్తుల నాణ్యత సర్టిఫికేషన్, గ్లోబల్ ప్రమాణాలతో ఉత్పత్తి తదితర అంశాల్లో సహకారం అందించేందుకు క్యూసిఐ ముందుకు వచ్చింది. ఎంఎస్ఎంఈ సంస్థల్లో నేషనల్ పెన్షన్ వ్యవస్థ అమలు, ఆర్థిక వ్యవహారాలు, సామాజిక భద్రత అంశాల్లో తోడ్పడేందుకు పీఎఫ్ఆర్డీఏ ఒప్పందం చేసుకుంది.

ఈ కార్యక్రమంలో మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, టీజీ భరత్, డీబీవీ స్వామి సహ ప్రజాప్రతినిధులు, ఎంఎస్ఎంఈ డెవలప్మెంట్ కార్పొరేషన్ సీఈఓ, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ సహా ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# పేదల సేవలో ఏపీనే నెంబర్-1

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :**సామాజిక పింఛన్ అంటే కేవలం రూ. 500లో, రూ. 1000 చేతిలో పెట్టే తూతూమంత్రపు ప్రక్రియ కాదు.. అది ఒక నిరుపేద కుటుంబానికి కొండంత అండ, ఆత్మగౌరవ ప్రతీక అనేది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ విధానం. సమాజంలోని అట్టడుగు వర్గాలు, వృద్ధులు, చేరదీసే దిక్కులేని అభాగ్యులు గౌరవప్రదమైన జీవనం సాగించాలనే ఉద్దేశ్యంతో ప్రారంభించిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం సరికొత్త చరిత్రను లిఖిస్తోంది. 2 ఏళ్ల పాలనలో రికార్డు స్థాయిలో సుమారు రూ. 65 వేల కోట్లకు పైగా నిధులను లబ్దిదారులకు కూటమి ప్రభుత్వం పంపిణీ చేసింది. దేశంలోని మరే ఇతర రాష్ట్రంలోనూ ఈ స్థాయిలో పెన్షన్ల పంపిణీ చేపట్టడం లేదు. గత ప్రభుత్వం 5 ఏళ్ల కాలంలో రూ. 91 వేల కోట్ల నిధులను పెన్షన్ల రూపంలో ఖర్చు పెడితే... అందులో 71.5 శాతం మేర నిధులను రెండేళ్ల కాలంలోనే కూటమి ప్రభుత్వం పంపిణీ చేపట్టింది. ఉద్యోగులకు ప్రతి నెలా 1వ తేదీన జీతాలు ఇస్తున్నట్టే... సామాజిక భద్రతా పెన్షన్లను అందుకుంటున్న ఎన్టీఆర్ భరోసా లబ్దిదారులకు ఠంచనుగా పెన్షన్ డబ్బులను ఇంటి వద్దకే వెళ్లి అందిస్తున్నారు ప్రభుత్వ సిబ్బంది. క్షేత్ర స్థాయిలో ఉండే స్వర్ణ గ్రామ, వార్డు కార్యాలయాలకు చెందిన సిబ్బంది ఉదయం 8–9 గంటల్లోనే సుమారు 75 నుంచి 80 శాతం మేర పెన్షన్ల పంపిణీ పూర్తి చేస్తున్నారు. ఏదైనా నెలలో ఒకటో తేదీ ఆదివారం కానీ.. శెలవు దినం అయితే.. ముందు నెలలోని లాస్ట్ వర్కింగ్ డే రోజునే పెన్షన్ మొత్తాలను లబ్దిదారులకు అందిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది కూటమి ప్రభుత్వం. ప్రభుత్వం ఆర్థికంగా ఎంతో ఇబ్బందులు ఉన్నా... ఇప్పటి వరకు ఒక్క రోజు కూడా జాప్యం చేయకుండా పెన్షన్ల పంపిణీని చేపట్టింది. అలాగే ముఖ్యమంత్రి ప్రతి నెలా క్రమం తప్పకుండా పేదల సేవలో పేరుతో పెన్షన్ల పంపిణీ



కార్యక్రమంలో పాల్గొంటున్నారు.

**పెన్షన్లల్లో ట్రెండ్ సెట్టర్ :** అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆర్థిక రక్షణ కల్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం వేస్తున్న అడుగులు నేడు లక్షలాది మంది జీవితాల్లో సరికొత్త కాంతులు నింపుతున్నాయి. తొలి నుంచి తెలుగుదేశమే పెన్షన్ల విషయంలో ట్రెండ్ సెట్ చేసింది. రాష్ట్రంలో సామాజిక పింఛన్ల పెంపునకు, తెలుగుదేశం పార్టీ భావజాలానికి విడదీయరాని అనుబంధం ఉంది. ఎన్టీఆర్ హయాం నుంచి ఇప్పటి వరకు లబ్దిదారుల చేతికి అందే మొత్తాన్ని భారీగా పెంచుతూ వచ్చిన ఘనత ముమ్మాటికీ తెలుగుదేశం ప్రభుత్వాలదే. గత పాలనలో రూ. 1000 పెంచడానికి ఐదేళ్ల సమయం తీసుకుంటే... కూటమి ప్రభుత్వం వచ్చి రావడంతోనే రూ. 1000 పెంచి ఇచ్చిన మాటను నిలబెట్టుకుంది. బాధ్యతలు స్వీకరించిన తక్షణమే వృద్ధులు, చేనేత, కల్లుగీత కార్మికులు, జానపద కళాకారులకు గతంలో ఉన్న రూ. 3 వేల పింఛన్‌ను రూ. 4 వేలకు పెంచారు. ప్రభుత్వం ఏర్పడిన తొలి నెలలోనే, అంతకుముందు పెరిగిన మూడు నెలల బకాయిలను కలుపుకుని ఏకంగా రూ. 7 వేలను లబ్దిదారుల ఇళ్ల వద్దకే అందించి మానవతా దృక్పథాన్ని చాటుకుంది కూటమి ప్రభుత్వం. ఇంతటి భారీ పెంపుదల దేశ సామాజిక సంక్షేమ చరిత్రలోనే అపూర్వమైన ఘట్టమనే చెప్పాలి.

**పేద కుటుంబాలకి పెద్ద దిక్కుగా కూటమి ప్రభుత్వం :** శాశ్వత వికలాంగులకు, మంచానికే పరిమితమైన వారికి రూ. 15 వేల పెన్షన్ కొండంత అండగా నిలుస్తోంది. శారీరక వైకల్యంతో బాధపడుతున్న దివ్యాంగుల పట్ల ప్రస్తుత కూటమి ప్రభుత్వం చూపిన శ్రద్ధ చూపెడుతోందనే ప్రశంసలు కూటమి ప్రభుత్వానికి అందుతున్నాయి. దివ్యాంగుల పింఛన్ మొత్తాన్ని గతంలో ఉన్న రూ. 3 వేల నుంచి రెట్టింపు చేసి నెలకు రూ. 6 వేలకు పెంచడం ద్వారా వారి కుటుంబాలకు ప్రభుత్వం పెద్ద దిక్కుగా నిలిచింది. అదే విధంగా, కిడ్నీ, లివర్, హార్ట్ మార్పిడి చేయించుకుని నిరంతరం ఖరీదైన మందులపై ఆధారపడే దీర్ఘకాలిక రోగుల పింఛన్‌ను సైతం రూ. 5 వేల నుండి రూ. 10 వేలకు రెట్టింపు చేసి ప్రభుత్వం వారి ప్రాణాలకు భరోసా కల్పించింది.

**పెండింగ్ లేకుండా స్పౌజ్ పెన్షన్లు :** మరణించిన పెన్షనర్ జీవిత భాగస్వామికి రూ. 4 వేల వితంతు పింఛన్‌ను కొత్తగా మంజూరు చేస్తూ ప్రభుత్వం ఇప్పటివరకు 2,14,113 మందికి కొత్తగా లబ్ధి చేకూర్చింది. ఇందుకోసం నెలకు సుమారు రూ. 85 కోట్లకు పైగా ఖర్చు చేస్తోంది. అలాగే, చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వరుసగా మూడు నెలలు వివిధ కారణాలతో పెన్షన్ తీసుకోకున్నా... ఆ మొత్తాలను ఒకేసారి తీసుకునే వెసులుబాటు కలిగిస్తోంది ప్రభుత్వం. దీని ద్వారా నవంబర్ 2024 నుండి మే 2026 వరకు 20.23 లక్షల మంది రూ. 1,712.92 కోట్ల బకాయిలను సులభంగా పొందగలిగారు. గత ప్రభుత్వ పాలనలో రకరకాల నిబంధనలు, రాజకీయ ఆంక్షల పేరుతో నిర్దాక్షిణ్యంగా పెన్షన్లల్లో ఎప్పటికప్పుడు కోతలు విధించేది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఎలాంటి ఆంక్షలు లేకుండా అర్హులైన 2.50 లక్షల మందికి కొత్త పింఛన్లు మంజూరు చేసి లబ్ధిదారుల కళ్లల్లో ఆనందం నింపారు.

## గుంటూరు మెడికల్ కాలేజీకి అపూర్వ గౌరవం




(మొదటి పేజీ తరువాయి)

మాజీ రాష్ట్రపతి డా. ఏపీజే అబ్దుల్ కలామ్‌తో కలిసి అభివృద్ధి చేసిన ‘కలాం–రాజు స్టెంట్’ వైద్యరంగంలో విప్లవాత్మక మార్పుకు నాంది పలికింది.

ప్రముఖ పీడియాట్రిక్ సర్జన్ డా. వై. నాయుడమ్మ, కలిసిన కవలలను విజయవంతంగా విడదీసిన శస్త్రచికిత్సలతో అంతర్జాతీయ గుర్తింపు పొందారు. ఆయన వైద్య సేవలకు గాను పద్మశ్రీ లభించింది.

ప్రఖ్యాత నేత్ర వైద్య నిపుణుడు, ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ వ్యవస్థాపకుడు డా. జీఎన్ రావు నేత్ర వైద్య రంగంలో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారు.

కార్డియో థొరాసిక్ సర్జన్ డా. డీ ప్రసాదరావు ఆంధ్రప్రదేశ్‌లో తొలి కరోనరీ బైపాస్ శస్త్రచికిత్స నిర్వహించి వైద్య చరిత్రలో నిలిచిపోయారు.

డా. ఎల్ నరేంద్రనాథ్ ఆర్థోపెడిక్ రంగంలో విశేష సేవలు అందించడమే కాకుండా, పోలియో బాధితుల కోసం తేలికపాటి కృత్రిమ కాళ్ల తయారీలో కీలక పాత్ర పోషించారు.

హృదయ శస్త్రచికిత్సలలో ప్రఖ్యాతి గాంచిన డా. ఎం గోపీచంద్ దేశంలో బీటింగ్ హార్ట్ బైపాస్ సర్జరీలకు మార్గదర్శకుడిగా గుర్తింపు పొందారు.

తెలుగు రాష్ట్రాల్లో తొలి హృదయ, ఊపిరితిత్తుల మార్పిడి శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించిన డా. ఎ. గోపాలకృష్ణ గోఖలే సేవా కార్యక్రమాలతో కూడా ప్రజల ప్రశంసలు అందుకున్నారు.

**పద్మ విభూషణ్‌తో ప్రత్యేక అనుబంధం :** పద్మ విభూషణ్ గ్రహీత డా. నాగేశ్వరరెడ్డి కుటుంబానికి కూడా గుంటూరు మెడికల్ కాలేజీతో సన్నిహిత అనుబంధం ఉంది. ఆయన తండ్రి డా. భాస్కరరెడ్డి ఈ కళాశాలలో పాథాలజీ ప్రొఫెసర్‌గా, ప్రిన్సిపల్‌గా సేవలందించడం మరో విశేషంగా నిలిచింది.

## రైతు రుణాల మాఫీ... విజయ్ మరో కీలక నిర్ణయం



**చెన్నై(జర్నలిస్ట్ ఫైల్) :**తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ రైతులకు ఉపశమనం కలిగించే కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు కోఆపరేటివ్ బ్యాంక్ నుంచి తీసుకున్న పంట రుణాలను మాఫీ చేస్తున్నట్టు సోమవారంనాడు ప్రకటించారు. ప్రభుత్వం ప్రకటించిన రుణ మాఫీ ప్రకారం రూ. 50,000 వరకూ పంట రుణాలు తీసుకున్న సన్నకారు రైతులకు పూర్తిగా రుణ మాఫీ చేస్తారు. రూ. 50 వేలకు పైబడి తీసుకున్న రుణాలకు 50 శాతం మాఫీని ప్రకటించారు. ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలో సచివాలయంలో జరిగిన ఉన్నత స్థాయి సమీక్షా సమీపంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆ ప్రకారం 2025 మే 1 నుండి 2026 ఫిబ్రవరి 28 మధ్యకాలంలో సహకార బ్యాంకుల్లో తీసుకున్న రుణాలకు మాత్రమే తాజా రుణమాఫీ వర్తిస్తుంది. ప్రభుత్వ నిర్ణయంతో 14.22 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరుతుందని, రాష్ట్ర ఖజానాపై రూ. 2,044 కోట్ల భారం పడుతుందని విజయ్ తెలిపారు.

**మేకేదాటు ప్రాజెక్టుపై సమీక్ష :** కావేరీ నదిపై కర్ణాటక ప్రతిపాదిత మేకేదాటు ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వ ఏవిధంగా స్పందించాలనే దానిపై కూడా ముఖ్యమంత్రి విజయ్ ఉన్నత స్థాయి సమావేశంలో చర్చించారు. కర్ణాటక ప్రతిపాదనను తమిళనాడు వ్యతిరేకిస్తూ వస్తోంది. ప్రాజెక్టు నిర్మాణంతో రాష్ట్రాలకు రావాల్సిన జలాలపై ప్రభావం పడుతుందని, రైతులకు నష్టం జరుగుతుందని తమిళనాడు ప్రభుత్వ వాదనగా ఉంది. కర్ణాటకలో ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఇటీవల భూమిపూజ జరగడం, ఈ వివాదంపై లీగల్ స్టాటస్‌ను విజయ్ సమావేశంలో అధికారులు సమీక్షించారు. కోర్టు అభిప్రాయాలను పరిగణనలోకి తీసుని సమగ్ర సంప్రదింపుల అనంతరం తీసుకోవాల్సిన లీగల్ చర్యలను వేగవంతం చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. మంత్రి ఎన్.ఆనంద్, ఆధవ్ అర్జున, ఆర్.నిర్మల్‌కుమార్, అడ్వకేట్ జనరల్ విజయ్ నారాయణ్ తదితర అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## రూ.33,660 కోట్లతో
# "భవ్య" పథకం ప్రారంభం



(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2026-27 ఆర్థిక సంవత్సరం నుంచి ఆరు సంవత్సరాల వ్యవధిలో పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) విధానంలో దేశవ్యాప్తంగా 100 ప్లగ్-అండ్-ప్లే పార్కులను అభివృద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. తొలి దశలో 50 పార్కుల ఏర్పాటుకు రాష్ట్రాల నుంచి ప్రతిపాదనలు ఆహ్వానించగా, "ఛాలెంజ్ మోడ్" విధానంలో మొదటి రెండు నెలల్లో 20 పార్కులు, తదుపరి రెండు నెలల్లో మరో 30 పార్కులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

100 నుంచి 1000 ఎకరాల విస్తీర్ణంలో (కొండ ప్రాంత రాష్ట్రాల్లో కనీసం 25 ఎకరాలు) గ్రీన్‌ఫీల్డ్ మరియు బ్రౌన్‌ఫీల్డ్ ప్రాజెక్టుల రూపంలో ఈ పార్కులు అభివృద్ధి చేయబడతాయని చెప్పారు. మౌలిక వసతుల కల్పన కోసం ఎకరానికి గరిష్ఠంగా రూ.1 కోటి వరకు కేంద్రం సహాయం అందించనుండగా, ప్రైవేట్ భాగస్వామ్య ప్రాజెక్టులకు ఎకరానికి రూ.50 లక్షల వరకు ఆర్థిక సహాయం అందిస్తుందని వెల్లడించారు.

క్లస్టర్ ఆధారిత అభివృద్ధి ద్వారా ఎంఎస్ఎంఈలు, స్టార్టప్‌లు మరియు గ్లోబల్ పెట్టుబడిదారులకు "రెడీ టు యూజ్" ఇండస్ట్రియల్ ఎకోసిస్టమ్ అందుబాటులోకి రానుందని మాధవ్ తెలిపారు. పరిశ్రమలకు అవసరమైన రహదారులు, విద్యుత్, నీటి సరఫరా, లాజిస్టిక్స్ వంటి అన్ని ఆధునిక సదుపాయాలతో కూడిన పారిశ్రామిక పార్కులు ఈ పథకం కింద అభివృద్ధి చేయబడతాయని పేర్కొన్నారు.

"ప్లగ్ అండ్ ప్లే" విధానంలో పరిశ్రమలు వేగంగా స్థాపించుకునేలా అన్ని మౌలిక సదుపాయాలను ముందుగానే సిద్ధం చేయడం ద్వారా పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఏర్పడుతుందని ఆయన అన్నారు. ఎగుమతుల ప్రోత్సాహం, దిగుమతులపై ఆధారాన్ని తగ్గించడం, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (ఎఫ్‌టీఏలు), అలాగే "ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్" సంస్కరణలు దేశ పారిశ్రామికీకరణకు మరింత దోహదపడతాయని పేర్కొన్నారు.

భవ్య పథకం ద్వారా దేశీయ, విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం, తయారీ రంగాన్ని బలోపేతం చేయడం, ఎగుమతులను పెంపొందించడం ప్రధాన లక్ష్యమని మాధవ్ తెలిపారు. ఈ ప్రాజెక్టుల అమలుతో సుమారు 15 లక్షల మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు కల్పించబడతాయని ప్రభుత్వ అంచనాలను ఆయన ప్రస్తావించారు.

దేశవ్యాప్తంగా చిన్న, మధ్య తరహా పరిశ్రమల విస్తరణకు ఈ పథకం బలమైన ప్రోత్సాహం ఇవ్వనుండగా, ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థల బలోపేతానికి కూడా దోహదపడుతుందని అన్నారు. "ఆత్మనిర్భర్ భారత్" మరియు "వికసిత భారత్ 2047" లక్ష్యాల సాధనలో "భవ్య" పథకం కీలక పాత్ర పోషించనుందని పీవీయన్ మాధవ్ పేర్కొన్నారు.

## నేడు ఏఐ ఆధారిత ఆరోగ్య వ్యవస్థ
# భాగస్వాముల సదస్సు

(మొదటి పేజీ తరువాయి)

**4 కేటగిరీల్లో 18 అంకుర సంస్థల నూతన ఆవిష్కరణలు :** ఏపీ మెడ్ టెక్ ఇన్నోవేషన్ ఛాలెంజ్ ప్రకటనకు అనుగుణంగా డయాగ్నస్టిక్ టూల్స్ కేటగిరి, పోర్టబుల్ పాయింట్ ఆఫ్ కేర్ కేటగిరి, స్మార్ట్ మానిటరింగ్ అండ్ వేరియబుల్స్ కేటగిరి (శరీరానికి ఉప పరికరాలు అమర్చి), రిమోట్ కేర్ టెలిమెడిసన్ కేటగిరీల్లో 18 అంకుర సంస్థలు ప్రభుత్వాసుపత్రుల్లో తమ సేవలను అందించాయి. మొత్తం 37 రోజుల వ్యవధిలో సుమారు 15 వేల మంది రోగులకు వైద్యుల సమక్షంలో సేవలు అందించాయి. టీబీ, ఐ స్క్రీనింగ్, సర్వైకల్ క్యాన్సర్ స్క్రీనింగ్, నవజాత శిశువుల్లో శ్వాశ సంబంధిత సమస్యలు, గుండె సంబంధిత సమస్యలు, రోగులతో వైద్యులు ఏఐ స్క్రైబ్ ద్వారా మాట్లాడడం, వంటి కొత్త ఆవిష్కరణల ద్వారా వైద్య సేవలు అందించడంలో పోటీపడ్డాయి. రోగులకు అందిశీచిన వైద్య సేవలు, వాటి ఫలితాలను క్యాథ్ కమిటీ (కమిటీ ఫర్ అప్లైడ్ టెక్నాలజీస్ ఇన్ హెల్త్) 4 కేటగిరీల్లో ప్రోత్సాహకాల్ని అందించేందుకు సంస్థల్ని మంగళవారం ఎంపిక చేయనున్నారు. ఈ కేటగిరిల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో వచ్చే అంకుర సంస్థలకు (మొత్తం 12) కూటమి ప్రభుత్వం రూ.5 లక్షలు, రూ.3 లక్షలు, రూ.2 లక్షల చొప్పున కలిపి మొత్తం రూ.40 లక్షలను ప్రోత్సాహకాల కింద ప్రభుత్వం ఇవ్వనుంది. ఈ కార్యక్రమం మంగళవారం సాయంత్రం 6 గంటల సమయంలో జరుగనుంది. సీఎం చంద్రబాబు విజన్ అనుసరించి.. ప్రయోగాత్మక విధానంలో జరిగిన ఏఐ ఆధారిత సేవలు మంచి ఫలితాలు ఇచ్చాయి

**వైద్య సేవల్లో ఏఐ వినియోగంపై ప్రత్యేక సదస్సు :** వైద్య సేవల్లో ఏఐ వినియోగంలో బెస్ట్ ప్రాక్టీసెస్ గురించి విడిగా జరిగే సదస్సులో పలువురు నిపుణులు వివరించనున్నారు. నేషనల్ హెల్త్ అథారిటీ జాయింట్ సెక్రటరీ కిరణ్ గోపాల్ వస్క, గోవిన్ క్యాపిటల్(సింగపూర్) ఫౌండర్ సిఇఓ డాక్టర్ ఆనంద్ గోవిందలూరి, అసోసియేషన్ ఆఫ్ ఫిజిషియన్స్ ఆఫ్ ఇండియా డాక్టర్ వైవియస్ ప్రభాకర్, రెడిక్స్ ఇన్ఫినిట్ (టొరంటో, కెనడా) సీనియర్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస సుబ్రహ్మణ్యం, వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ గణేషన్ వీరపాండియన్, సెకండరీ హెల్త్ డైరెక్టర్ చక్రధరబాబు సదస్సులో పాల్గొననున్నారు.

# పారిశ్రామిక రంగానికి కేరాఫ్ అడ్రస్‌గా చిలకలూరిపేట

**చిలకలూరిపేట (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో 175 మీవీజు పార్కులను ఏర్పాటు చేసి, "ప్రతి కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్తను" తయారు చేయాలన్న కూటమి ప్రభుత్వ సంకల్పానికి ఈ పార్క్ నిదర్శనమని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. ఈ పార్క్ ద్వారా పల్నాడు ప్రాంతంలోని యువ పారిశ్రామికవేత్తలకు సరికొత్త అవకాశాలు, సాంకేతిక ఆవిష్కరణలకు అద్భుతమైన ప్రోత్సాహం లభిస్తాయని ఆయన తెలిపారు. చిలకలూరిపేట నియోజకవర్గం ఇప్పటికే పారిశ్రామిక రంగానికి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిందని ఎంపీ పేర్కొన్నారు. ఒక్క చిలకలూరిపేట నియోజకవర్గంలోనే కాటన్, జిన్నింగ్, స్పిన్నింగ్, వీవింగ్, కాటన్ ఆయిల్స్ మిల్స్ యూనిట్ల ద్వారా దాదాపు 30 నుంచి 35 వేల మందికి ఉపాధి పొందుతున్నారని ఆయన తెలిపారు.

**క్లస్టర్ల ద్వారా మహిళా సాధికారత :** పారిశ్రామికీకరణతో పాటు మహిళా సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నట్లు గౌరవ ఎంపీ తెలిపారు. ఐ=ణూ డిపార్ట్‌మెంట్ ద్వారా క్లస్టర్లను ఏర్పాటు చేసి మహిళలకు ఉపాధి కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఎడ్లపాడు మండలంలో మునగ ప్రాసెసింగ్ యూనిట్, నాదెండ్ల మండలంలో డైరీ యూనిట్, చిలకలూరిపేటలో కరివేపాకు, కార్పెంటరీ యూనిట్లకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఈ విధంగా ఒక్క చిలకలూరిపేటలోనే కాకుండా, యావత్ పల్నాడు జిల్లాలోని 28 మండలాల్లో 28 క్లస్టర్లను ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు వెల్లడించారు.

# గోదావరి కాలుష్య నివారణకు రూ.100 కోట్లు



(మొదటి పేజీ తరువాయి)

క్షేత్రస్థాయి సమస్యలను గుర్తించి, వాటికి శాశ్వత పరిష్కారాలను సూచించే విధంగా ఈ టాస్క్ ఫోర్స్ పని చేయాలని సూచించారు. టాస్క్ ఫోర్స్ ఇచ్చే నివేదికలు, సూచనలు క్షేత్ర స్థాయిలో వేగంగా అమలు జరిగేలా పర్యవేక్షణ కమిటీ ఉండాలని స్పష్టం చేశారు. నదుల రక్షణకు ఇవాళ్టి నుంచే యాక్షన్ ప్లాన్ అమలు చేయాలని, వచ్చే ఆరు నెలల్లో నదుల్లో స్పష్టమైన మార్పు కనిపించాలని ఆదేశించారు. సోమవారం ఉదయం రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయంలో గోదావరి నది కాలుష్యం, పుష్కరాల సన్నద్ధతపై పీసీబీ, అటవీ-పర్యావరణ శాఖ, పంచాయతీరాజ్ ఉన్నతాధికారులు, జిల్లా అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహిశీచారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నాదెండ్ల మనోహర్ , కందుల దుర్గేష్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "మనం తాగే పవిత్రమైన గోదావరి నీటిలోనే, మన ఇళ్ల నుంచి వచ్చే మురుగునీటిని వదిలేస్తూ నదిని తీవ్రంగా అపవిత్రం చేస్తున్నాం. నది ఎక్కడెక్కడ కలుషితమవుతోంది, ఏయే కాలువలు, ఉపనదులు వ్యర్థాలను మోసుకొచ్చి నదిలో కలుస్తున్నాయి అనే విషయాలపై తక్షణమే క్షేత్రస్థాయి పరిశీలన జరపాలి. నది తీవ్రంగా కలుషితమవుతున్న ప్రధాన కేంద్రాలను గుర్తించి, అక్కడ తక్షణమే 'పొల్యూషన్ ఆడిట్' నిర్వహించాలి. నదిలోకి మురుగు నీరు, రసాయనాలు చేరుతున్న కీలక ప్రాంతాల నుంచి నీటి నమూనాలను సేకరించి ల్యాబొరేటరీ పరీక్షలకు పంపాలి. నదీ తీరాలను, మన జీవ నదులను కాపాడుకోకపోతే భవిష్యత్తు తరాలకు మనుగడే ఉండదు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'మిషన్ ఫర్ క్లీన్ గోదావరి' వంటి పథకాలు కేవలం ఆర్బాటాలకే పరిమితమయ్యాయి అనిపిస్తోంది. క్షేత్రస్థాయిలో సరైన విధానం లేకపోవడం వల్లే ఆశించిన ప్రయోజనం దక్కడం లేదు.

**మిషన్ ఫర్ క్లీన్ గోదావరి బోర్డులకే పరిమితం కారాదు :** పుష్కరాలు దగ్గరకు వచ్చాక హడావుడిగా టెండర్లు పిలిచి, నాణ్యత లేకుండా తాత్కాలికంగా ఘాట్లు, కట్టడాలు కడితే... అవి కూలిపోయి భక్తులు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. గతంలో అలాంటి సంఘటనలు చూశాం. అలాంటి దారుణమైన బ్రాండ్ మన ఆంధ్రప్రదేశ్‌కు వద్దు. ముహూర్తం దగ్గరపడ్డాక కంగారుపడటం కాదు... ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా, మనసా వాచా కర్మణా చిత్తశుద్ధితో పనులు చేయాలి. భక్తులు ఎంతో పవిత్ర భావంతో పుష్కర స్నానానికి వస్తారు. ఘాట్లకు వచ్చి వెళ్లాక.. మేము మురికి నీళ్లలో స్నానం చేసి వెళ్లాం అనే మాట ఎవరి నోటి వెంబడైనా వస్తే అది మన ప్రభుత్వానికే అవమానం. అందుకే మిషన్ ఫర్ క్లీన్ గోదావరి కేవలం బోర్డులకే పరిమితం కాకూడదు. గోదావరి నదుల్లోకి మురుగునీరు, పారిశ్రామిక వ్యర్థాలు కలవకుండా పటిష్టమైన దీర్ఘకాలిక ప్రణాళికలు అమలు చేయాలి.

గోదావరి పుష్కరాలు అంటే కేవలం రాజమండ్రే అనే భావన నుంచి బయటకు వచ్చి... గోదావరి ప్రవహిస్తున్న ఆరు జిల్లాలకు సంబంధించిన అన్ని పంచాయతీలను భాగస్వాములు చేయాలి. గత పుష్కరాలకు 4.6 కోట్ల మంది భక్తులు వస్తే, ఈసారి ఆ రద్దీ రెట్టింపై దాదాపు 10 కోట్ల మంది వస్తారని అంచనా ఉంది. అందుకు తగ్గట్లు ఏర్పాట్లు ఉండాలి.

**ప్లాస్టిక్ రహిత పుష్కరాలను నిర్వహిద్దాం :** జీవ నదులను కాపాడుకోవడానికి విప్లవాత్మక నిర్ణయాలు అవసరం. గోదావరి పుష్కరాలను దేశం మొత్తం మన వైపు తిరిగి చూసేలా, అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలంటే ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా అరికట్టాలి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జీవనదులను ఎంత పవిత్రంగా, పర్యావరణ హితంగా కాపాడుకుంటుందో దేశం మొత్తానికి తెలియాలి. ఒక్క రాజమండ్రిలోనే కాకుండా గోదావరి ప్రవహించే ఆరు జిల్లాలలో ఏడాదిపాటు ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలి. పుష్కరాల నాటికి నదీ తీరాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ అన్నదే కనిపించకూడదు. ఇందుకోసం ప్రత్యేకంగా ఏర్పాటైన ఎన్విరాన్‌మెంటల్ టాస్క్‌ఫోర్స్ రాబోయే ఏడాది కాలంలో ప్లాస్టిక్‌ను పూర్తిగా నిర్మూలించేలా, దానికి తగిన ప్రత్యామ్నాయాలను అందుబాటులోకి తెచ్చేలా కఠినమైన చర్యలు చేపట్టాలి.


**కాలుష్య నియంత్రణ చర్యలకు రూ.100 కోట్లు బడ్జెట్ :** గోదావరి ప్రవహించే ఆరు జిల్లాల పరిధిలో కాలుష్య నియంత్రణ చర్యల కోసం పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ద్వారా రూ.100 కోట్ల ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయిస్తున్నాం. కాలుష్యాన్ని అరికట్టడానికి పీసీబీ ఆధ్వర్యంలో ఒక పటిష్టమైన అంతర్ శాఖల (జిల్లా) టాస్క్ ఫోర్స్ ఏర్పాటు కానుంది. ఈ ఆరు జిల్లాలకు సంబంధించిన అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు ఇందులో భాగస్వాములుగా ఉంటూ కలిసి పనిచేస్తారు. కొన్ని పరిశ్రమలకు సంబంధించిన రసాయన వ్యర్థాలు నేరుగా గోదావరి నదీపాయల్లో కలుస్తున్నాయని, దీనిపై ఈ టాస్క్ ఫోర్స్ ప్రత్యేకంగా నిఘా పెట్టి క్షేత్రస్థాయిలో పరిశీలిస్తుంది.

**పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో గోదావరి తీర గ్రామాల్లోనూ పుష్కర ఘాట్లు :** రాబోయే గోదావరి పుష్కరాలకు వివిధ ప్రాంతాల నుంచి సుమారు 10 కోట్ల మంది భక్తులు వస్తారని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఈ భారీ రద్దీని తట్టుకోవడానికి పుష్కర ఏర్పాట్లను కేవలం రాజమహేంద్రవరంతోపాటు గోదావరి పరిసర గ్రామాల్లోని ఘాట్లను కూడా అద్భుతంగా తీర్చిదిద్దాలని నిర్ణయించాం. గోదావరి ప్రవహించే ఆరు జిల్లాల పరిధిలో అత్యంత ప్రాధాన్యత కలిగిన 285 గ్రామ పంచాయతీలను అధికారులు గుర్తించారు. ఈ గ్రామాల్లోని పుష్కర ఘాట్లను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతాం. ఇందుకోసం ఆయా పంచాయతీలకు ప్రత్యేకంగా నిధులను కేటాయిస్తాం. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల వసతి కోసం గ్రామాల్లోని ఇళ్లలోనే 'హోం స్టే' సౌకర్యాలను కల్పిస్తాం. పుష్కరాల పనులు, పర్యాటకుల రాక వల్ల స్థానిక ప్రజలకు ఉపాధి దొరికి, గ్రామాలు ఆర్థికంగా ఎంతో బలోపేతం అవుతాయి.

**ప్లాస్టిక్ ఫ్రీ గోదావరిలో భాగస్వాములు కావాలి :** గోదావరి నదీ పాయల్లో చూస్తే కాలుష్యంతోపాటు ప్లాస్టిక్ వ్యర్థాలు ఎక్కువగా కనబడుతున్నాయి. నివారణా చర్యల్లో భాగంగా ప్లాస్టిక్ ఫ్రీ రాజమండ్రి పేరిట అవగాహనా కార్యక్రమం ప్రారంభిస్తున్నాం. ప్రజలంతా ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలి. జీవ నది మన తల్లి లాంటిది. దాన్ని కలుషితం చేస్తే మనకు భవిష్యత్తుని మనమే పాడుచేసుకున్న వారం అవుతాం. ఉభయ గోదావరి జిల్లాల ప్రజలు కూడా ప్లాస్టిక్ ఫ్రీ నినాదాన్ని ముందుకు తీసుకువెళ్లాలి. గోదావరి నది కాలుష్యం బారినపడకుండా చూడాల్సిన బాధ్యతను మరోసారి అందిరికీ తెలియజేస్తున్నాం. పర్యావరణ పరిరక్షణలో భాగంగా కృష్ణా, గోదావరి నదులను శుభ్ర పరిచే బాధ్యత తీసుకుంటాం. జీవ నదులు కాలుష్యం బారినపడకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. పుష్కరాలు వచ్చే వరకు ప్రతి రెండు వారాలకు ఒకసారి కాలుష్యంతోపాటు, అభివృద్ధి పనులపైనా సమీక్ష నిర్వహిస్తామ"న్నారు. ఈ కార్యక్రమంలో శాసనమండలిలో ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆదిరెడ్డి శ్రీనివాస్ ,బత్తుల బలరామకృష్ణ నల్లమిల్లి రామకృష్ణా రెడ్డి, వేగుళ్ల జోగేశ్వరరావు, శాసన మండలి సభ్యులు సోము వీర్రాజు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, పంచాయతీ రాజ్ కమిషనర్ కృష్ణతేజ, కలెక్టర్ శ్రీమతి కీర్తి చేకూరి, కాలుష్య నియంత్రణ మండలి ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఎంఎస్ఎంఈతో ఏపీలో పారిశ్రామిక విప్లవం

(మొదటి పేజీ తరువాయి)



సోమవారం విజయవాడలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళావేదికలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా ఎంఎస్ఎంఈ గ్రోత్ సమ్మిట్ 2026 కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రి కొండపల్లి మాట్లాడుతూ 1995 - 2004 మధ్య ముఖ్యమంత్రి ఆలోచనతో తన లాంటి ఎంతోమంది ఐటీ రంగంలో ఉన్నతస్థానాల్లోకి ఎదిగే అవకాశం వచ్చిందన్నారు. 2014 రాష్ట్ర విభజన తర్వాత ఏపీని పారిశ్రామికంగా పరుగులు పెట్టించేందుకు ముఖ్యమంత్రి గారు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌గా పరుగులు పెట్టిస్తున్నారని మంత్రి కొనియాడారు. గత ప్రభుత్వం పారిశ్రామికవేత్తలను వెళ్లగొట్టడమే తప్ప ఏ ఒక్కరిని రాష్ట్రంలోకి రానివ్వలేదు... పెట్టుబడులు పెట్టనీయలేదని మంత్రి విమర్శించారు. ప్రతి ఇంటికి ఒక పారిశ్రామిక వేత్త ఉంటే రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి తిరుగుండదన్న ఆలోచనతోనే ముఖ్యమంత్రి ప్రతి నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పార్కు ఉండాలని లక్ష్యంగా పెట్టుకున్నారని మంత్రి తెలిపారు. ఈ క్రమంలోనే ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 19 పార్కులు ప్రారంభమవ్వగా.. సోమవారం 38 పార్కులకు ముఖ్యమంత్రి వర్చువల్‌గా శంకుస్థాపన చేయటం రాష్ట్రంలో పారిశ్రామిక విప్లవానికి నాందిగా అభివర్ణించారు.

క్లస్టర్ డవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద సీఎం రు. 200 కోట్లను విడుదల చేస్తున్నారని.. అలాగే సెక్టార్ బేస్డ్ ఇండస్ట్రీయల్ పార్క్‌లో కామన్ పెసిలిటీస్ కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. 2 సంవత్సరాల్లో ఎంఎస్ఎంఈలకు 2,11,894 కోట్ల రుణాలు ఇచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని మంత్రి కొనియాడారు. ప్రధానమంత్రి ముద్రయోజనా పథకం కింద రు. 39,941 కోట్ల రుణ సౌకర్యం కల్పించామన్నారు. పీఎంఎఫ్ఎం ఈ కింద సబ్సిడీతో 3387 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు స్థాపించేలా చేశామన్నారు. ఎస్సీ, ఎస్టీ, మహిళా పారిశ్రామికవేత్తల కోసం 28,758 కొత్త వ్యాపారాలు స్టాండప్ ఇండియా కింద స్థాపించబడ్డాయని మంత్రి పేర్కొన్నారు. ఏపీ క్రెడిట్ గ్యారంటీ స్కీమ్ ద్వారా రూ.5 వేల కోట్ల రుణాలు ఇచ్చేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టామని.. రాష్ట్రంలో ఉన్న 20.77 లక్షల ఎంఎస్ఎంఈల్లో చాలా మంది రుణాలు దొరకక ఇబ్బందులు పడుతోన్న నేపథ్యంలో ఏపీ ఎస్ఎంఈ ఎక్సేంజ్ ఏర్పాటు చేసేందుకు టాస్క్‌ఫోర్స్ కమిటీని కూడా నియమించామని మంత్రి తెలిపారు. స్వర్ణాంధ్ర నిర్మాణం కోసం ప్రతి ఇంట్లో ఒక పారిశ్రామిక వేత్త ఉండాలన్న నినాదంలో ప్రతి ఒక్కరు ముందడుగు వేయాలని మంత్రి కొండపల్లి ఆకాంక్షించారు.

# కాలుష్యరహిత గోదావరి పుష్కరాలు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** 'గోదావరి నదిలోకి కలిసే కాలుష్యకారక వ్యర్థాలు, జలాలు, వాటి నిర్వహణపై పూర్తిస్థాయి ఆడిట్ చేపట్టి నివేదిక ఇవ్వండి. ఇప్పటివరకు తీసుకున్న చర్యలు ఏమిటి..? భవిష్యత్తులో చేయబోయే పనుల మీద స్పష్టమైన ప్రణాళికను సిద్ధం చేయండి' అని ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ రాష్ట్ర ఉన్నత అధికారులు, తూర్పు గోదావరి జిల్లా అధికారులను ఆదేశించారు. వచ్చే ఏడాది నిర్వహించనున్న గోదావరి పుష్కరాలను 'కాలుష్యరహిత గోదావరి' థీమ్ తో సాకారం చేసి నిర్వహించడానికి కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని స్పష్టం చేశారు. రాజమహేంద్రవరం పర్యటనలో భాగంగా సోమవారం ఉదయం 6 గం.కు పవన్ కళ్యాణ్ రాజమహేంద్రవరం పుష్కరాల ఘాట్ నుంచి కోటిలింగాలు ఘాట్ వరకు పడవలో ప్రయాణించి గోదావరి జలాల కాలుష్యకారక ప్రాంతాలని పరిశీలించారు. పుష్కరాల్లో చేయాల్సిన పనుల తీరు, త్వరలో చేపట్టబోయే పనుల ప్రణాళికను స్వయంగా పరిశీలించారు. గోదావరి గట్ల సుందరీకరణ పనులు ఎంతవరకు వచ్చాయనేది, పుష్కరాల నేపథ్యంలో గట్లను ఎలా తీర్చిదిద్దబోతున్నది అధికారులు వివరించారు. ఈ సందర్భంగా చింతలమ్మ ఘాట్ వద్ద నల్లా ఛానల్ ద్వారా రాజమహేంద్రవరం మురుగునీరు గోదావరిలోకి కలిసే ప్రాంతాన్ని పవన్ కళ్యాణ్ స్వయంగా పరిశీలించారు. నది తీరంలో జరుగుతున్న కాలుష్యం తీరును స్వయంగా చూశారు. నీటిని ఎలా శుద్ధి చేస్తున్నారనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. అక్కడే ఉన్న సిబ్బందితో మాట్లాడి వ్యర్థాలను వేరు చేసే విధానాన్ని చూశారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ అధికారులకు ఆదేశాలిస్తూ "గోదావరిలోకి రోజువారీ సుమారుగా 55 ఎం. ఎల్. డి. (మిలియన్ లీటర్స్ పర్ డే) మురుగునీరు వస్తున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. ఈ మురుగు నీటిని శుద్ధి చేసే విధానం శాస్త్రీయంగా జరగాలి. మురుగు నీటిని నేరుగా గోదావరిలోకి వదలడం వల్ల జలాలు కలుషితం అవుతున్నాయనే ఫిర్యాదులు వస్తున్నాయి. దీనిపై దృష్టి సారించాలి.

**నిధులను సత్కార్యం కోసం వినియోగించుకుందాం :** గోదావరి పుష్కరాలకు ఖర్చు చేసే ప్రతి పైసాను ప్రజలకు ఉపయోగపడే, గోదావరి నది తీరాన్ని కాపాడే మంచి పనులకు ఉపయోగించుకోవాలి. మొదట కాలుష్యకారక అంశాలపై పూర్తిస్థాయి ఆడిట్ జరగాలి.. తర్వాత దానిని ఎలా అధిగమించాలి అనే అంశాల పట్ల దృష్టి సారించవచ్చు. కేవలం లెక్కలతో సరిపెట్టకుండా పూర్తి స్థాయి యాక్షన్ ప్లాన్ తో ముందుకు వెళ్దాం. కేంద్ర జల శక్తి ద్వారా ఎన్.ఆర్. సి. పి. నిధులు రూ. 416 కోట్లలో రూ. 95 కోట్ల నిధులకు పరిపాలన అనుమతులు వచ్చాయి. ఈ నిధులతో కొత్త ట్రీట్మెంట్ ప్లాంట్లను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించాలి. పూర్తిస్థాయిలో మురుగు లేకుండా జలాలను గోదావరిలోకి విడిచిపెట్టే బాధ్యతను తీసుకోవాల"ని ఆదేశించారు.

**పేపర్ మిల్ కాలుష్యంపై ఆరా:** ఆంధ్ర పేపర్ మిల్స్ కాలుష్య జలాలు గోదావరిలోకి విడుదల మీద ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ ఆరా తీశారు. రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ శ్రీ కృష్ణయ్య నుంచి వివరాలు అడిగారు. ప్రస్తుతం పేపర్ మిల్లు ద్వారా బయటకు వచ్చే వ్యర్థాలను దూరంగా లంకల్లో విడిచి పెడుతున్నారని, దీనికి ప్రత్యామ్నాయంగా ఆ కంపెనీ మరో ప్రాంతంలో శుద్ధి చేసేందుకు ఆలోచిస్తుందని ఆయన తెలియజేశారు. ప్రత్యామ్నాయ పనులు వేగంగా జరిగేలా చూడాలని, అప్పటివరకు మరో శుద్ధి ప్లాంట్ నిర్మించుకునేలా యాజమాన్యానికి ఆదేశాలు ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రివర్యులు దిశానిర్దేశం చేశారు.

**ఆసాంతం పరిశీలిస్తూ :** బోటులో ప్రయాణిస్తున్న దగ్గర నుంచి మున్సిపల్ కార్యాలయానికి చేరుకునే వరకు గోదావరి కాలుష్య నివారణకు తీసుకోబోతున్న చర్యలను పవన్ కళ్యాణ్ అధికారులను వివరంగా అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ప్రత్యక్షంగా ట్రీట్మెంట్ ప్లాంట్ వద్దకు వెళ్లి వేరు చేస్తున్న వ్యర్థాలను సైతం చూశారు. ఆ వ్యర్థాలను ఏం చేస్తారని అడిగి తెలుసుకున్నారు. వ్యర్థ జలాలను శుద్ధి చేయడానికి ప్రస్తుతం ఎలాంటి శాస్త్రీయ పద్ధతి ఉపయోగిస్తున్నారని వివరాలు అడిగారు. నూతన విధానాలు వస్తున్నాయని దానికి అనుగుణంగా, ఎప్పటికప్పుడు అప్డేట్ కావాలని అధికారులు సూచించారు. అక్కడి నుంచి నేరుగా పుష్కరాల పనుల సమీక్ష నిమిత్తం రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయానికి పవన్ కళ్యాణ్ చేరుకున్నారు. పవన్ కళ్యాణ్ తోపాటు మంత్రులు నాదెండ్ల మనోహర్ , కందుల దుర్గేష్, శాసన మండలిలో ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు , ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి వాసు, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, బత్తుల బలరామకృష్ణ, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రాష్ట్ర పోలీసు హౌసింగ్ బోర్డ్ చైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాస్, అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, ఎస్పీ నరసింహ కిషోర్, రాజమండ్రి నగర పాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా తదితరులు ఈ పర్యటనలో పాల్గొన్నారు.

# త్వరలో ఎక్సైజ్ రంగంలో సంస్కరణలు




(మొదటి పేజీ తరువాయి)


సమావేశంలో ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ముఖ్య కార్యదర్శి ముకేష్ కుమార్ మీనా, కమిషనర్ చామకూరి శ్రీధర్, ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ ప్రత్యక్షంగా పాల్గొన్నారు. ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దూర మాధ్యమం ద్వారా సమావేశానికి హాజరయ్యారు.

రాష్ట్రంలో అమలులో ఉన్న ఎక్సైజ్ విక్రయ విధానం, దాని అమలు తీరుపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. లైసెన్స్ రుసుముల సవరణ, మద్యం దుకాణాల పునర్విభజన, వ్యాపారుల ఆర్థిక స్థిరత్వం, పారదర్శకత పెంపు వంటి అంశాలపై అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. జిల్లాల వారీగా విక్రయాలు, ఆదాయం, మార్కెట్ పరిస్థితులపై కూడా సమీక్ష నిర్వహించారు. అంతర్జాతీయ పరిస్థితులు, యుద్ధ ప్రభావం కారణంగా ముడి సరుకులు, రవాణా, ప్యాకేజింగ్ ఖర్చులు పెరిగిన నేపథ్యంలో బీరు, మద్యం ధరల సవరణ అంశాన్ని కూడా సమావేశంలో పరిశీలించారు. ధరల మార్పులతో ప్రభుత్వ ఆదాయం, వ్యాపారులు, వినియోగదారులపై పడే ప్రభావంపై అధికారులు వివరించారు.

అదేవిధంగా విమానాశ్రయాల్లో మద్యం విక్రయ కేంద్రాల ఏర్పాటు, డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ బలోపేతం, చలనం ఆధారిత గరిష్ఠ చిల్లర ధర ముద్రణ, అధిక శుద్ధి ఆల్కహాల్ తయారీకి ప్రత్యేక అనుమతి విధానం వంటి అంశాలను కూడా సమావేశంలో సమీక్షించారు.

రాష్ట్రంలో పారదర్శకత పెంపు, ఆదాయ వృద్ధి, ఆధునికీకరణ, పెట్టుబడుల ఆకర్షణ లక్ష్యంగా ఈ సంస్కరణలు ఉపయోగపడతాయని అధికారులు తెలిపారు.

# బాధ్యతాయుత జీవన విధానంపై ప్రజల్లో అవగాహన కల్పించాలి



○ జాయింట్ కలెక్టర్‌కు బీజేపీ నేతల వినతి

**విజయవాడ, (జర్నలిస్ట్ ఫైల్):** అంతర్జాతీయ పరిస్థితులు, యుద్ధాల ప్రభావం, ఆర్థిక అస్థిరత, సరఫరా వ్యవస్థల లోపాలు, పెరుగుతున్న ఇంధన ధరలు, నీరు-విద్యుత్ వనరులపై అధిక ఒత్తిడి వంటి పరిస్థితుల నేపథ్యంలో ప్రజలు మరింత బాధ్యతాయుతంగా జీవించాల్సిన అవసరం ఉందని బీజేపీ ఎన్టీఆర్ జిల్లా నాయకులు పేర్కొన్నారు.

విజయవాడ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలిక్యాకు వినతిపత్రం అందజేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు ఇచ్చిన "పొదుపు జాగ్రత్తలు - బాధ్యతాయుత జీవన విధానం" సందేశాన్ని ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సమగ్ర అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.

ప్రస్తుత పరిస్థితుల్లో ఇంధన, నీటి, విద్యుత్ వనరుల వినియోగంలో ప్రజలు మితవ్యయం పాటించాల్సిన అవసరం ఉందని తెలిపారు. విద్యార్థులు, యువత, మహిళలు, సామాన్య ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ మోర్చా అధ్యక్షుడు సయ్యద్ బాషా, జిల్లా ఉపాధ్యక్షుడు నున్న కృష్ణ, ప్రధాన కార్యదర్శి కోలపల్లి గణేష్, కార్యదర్శి నాని, యువమోర్చా జిల్లా అధ్యక్షుడు గొట్టిక శివకృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడు ప్రమోద్, ప్రధాన కార్యదర్శి సాయి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎస్సీ ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా పురుషోత్తం ఎంపిక

**-నిర్మల్‌లో ఘన సన్మానం**



**నిర్మల్ జిల్లా, మే 25 (జర్నలిస్ట్ ఫైల్) :** హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి ఎస్సీ ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ సమావేశంలో నిర్మల్ జిల్లాకు చెందిన పురుషోత్తం జాయింట్ సెక్రటరీగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నిక శుక్రవారం హైదరాబాద్‌లోని పద్మిని హోటల్‌లో నిర్వహించిన సమావేశంలో ఏకాభిప్రాయంతో పూర్తయ్యింది. ఈ సందర్భంగా నిర్మల్ జిల్లా కేంద్రంలోని విశ్రాంతి భవనంలో ఆదివారం ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పురుషోత్తం ను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలిపారు. రాష్ట్ర స్థాయి బాధ్యతను పొందడం జిల్లాకు గర్వకారణమని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పురుషోత్తం మాట్లాడుతూ, తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, హక్కుల సాధన కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి, వారి సంక్షేమానికి తన వంతు పాత్ర పోషిస్తానని ఆయన తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అందుకోవాలని, సమాజ సేవలో ముందుండాలని సన్మాన సభలో పాల్గొన్న నాయకులు, మిత్రులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాజురా గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యులు టీకీ శ్రీనివాస్, తమ్మ రాశి సురేష్ తదితరులు పాల్గొని పురుషోత్తం ను అభినందించారు.

## తెలంగాణ రక్షణ సేన పార్టీ రామగుండం నియోజకవర్గ ఇంచార్జీగా

**-అందె సదానందం నియామకం**



**రామ్ మందిర్ ఏరియా, మే 25 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ రామగుండం నియోజకవర్గ ఇంచార్జీగా తెలంగాణ జాగృతి సాంస్కృతిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు అందె సదానందంను పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత నియమించారు. ఈ సందర్భంగా అందె సదానందం మాట్లాడుతూ, మే 20 నుంచి జూన్ 20 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న జెండా పండుగ కార్యక్రమాల సందర్భంగా నియోజకవర్గ ఇంచార్జీలను పార్టీ ప్రకటించిందన్నారు. ఇందులో భాగంగా తనను రామగుండం నియోజకవర్గ ఇంచార్జీగా నియమించడం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ అవకాశం కల్పించిన పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవితకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ జెండా పండుగ కార్యక్రమాలను రామగుండం నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌తో పాటు అంతర్గాం, పాలకుర్తి మండలాల గ్రామాల్లో ఘనంగా నిర్వహిస్తామని చెప్పారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి సంస్థను మరింత బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని అందె సదానందం పేర్కొన్నారు.

## భూపతిపూర్‌లో గుడేటి రెడ్డి రైతు సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక




**రాయికల్, మే 25 (జర్నలిస్ట్ ఫైల్) :** రాయికల్ మండలంలోని భూపతిపూర్ గ్రామంలో గుడేటి రెడ్డి రైతు సంఘం నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఏనుగు కాశిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఎల్లాల రాజేందర్ రెడ్డి, కార్యదర్శిగా ఏలేటి శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారిగా చిట్టెటి రఘునందన్ రెడ్డి ఎన్నికయ్యారు. సలహాదారులుగా సోమ లక్ష్మారెడ్డి, ఏనుగు రవీందర్ రెడ్డిని ఎంపిక చేశారు. సంఘ అభివృద్ధికి కృషి చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు. నూతనంగా ఎన్నికైన వారికి సంఘ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

## జిల్లా కురవ సంఘం అధ్యక్షునిగా కైప విజయ కిరణ్



**నంద్యాల, మే 25 (జర్నలిస్ట్ ఫైల్) :** నంద్యాల జిల్లా కురువ సంఘం కార్యవర్గం ఎన్నిక పాన్ ఫంక్షన్ హాల్ నందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కురుబ /కురుమ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప సంఘం , మాజీ కర్నూలు జిల్లా పరిషత్ చైర్మన్ బత్తిన వెంకటరాముడు , రాష్ట్ర సంఘం ఉపాధ్యక్షులు సంకల శ్రీరాములు , సహాయ కార్యదర్శి జి మహేంద్ర ఆధ్వర్యంలో ఎన్నిక ఏకగ్రీవంగా ఈ క్రింది వారిని ఎన్నుకోవడం జరిగింది. నంద్యాల జిల్లా అధ్యక్షులుగా కైప విజయ కిరణ్ (నంద్యాల)ఉపాధ్యక్షులుగా పోతురాజు యుగంధర్ ప్రసాద్ (బిలకల గూడూరు) పాలమర్రి పరమేశ్వరుడు (వేల్పనూరు) ప్రధాన కార్యదర్శి వంక నాగరాజు (జిల్లెల్ల),వర్కింగ్ ప్రెసిడెంట్ గా కురువ సాంబశివుడు (పెసరవాయి),గౌరవాధ్యక్షులుగా చిక్కెం బాల హుసేనీ ( యాళ్లూరు) కురువ గిడ్డయ్య (నెరవాడ)అదేవిధంగా ఆదివారం నంద్యాల పట్టణ కురువ సంఘం ఆధ్వర్యంలో పదవ తరగతి మరియు ఇంటర్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ప్రధానం చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో నంద్యాల పట్టణ కమిటీ సభ్యులు కైపహరినాథ్ బాబు, కళ్ళే విజయ్ కుమార్, నారాయణ కిల్లా రవికుమార్ , బెల్ల శ్రీనివాసులు ఫణిరాజ్,బలమద్దిలేటి, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష.

**-మంత్రులతో వీడియో కాన్ఫరెన్స్**
**-మే చివరికి కొనుగోళ్లు పూర్తి చేయాలని ఆదేశాల**
**-రైతులకు వేగంగా చెల్లింపులు చేస్తున్న ప్రభుత్వం**







**హైదరాబాద్, మే 25 (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో యాసంగి ధాన్యం కొనుగోళ్లపై తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరిలక్ష్మణ్‌కుమార్ పాల్గొన్నారు. ధాన్యం కొనుగోళ్ల పురోగతి, రైతులకు చెల్లింపులు, సన్‌ఫ్లవర్ పంట కొనుగోళ్ల ఏర్పాట్లపై సమగ్రంగా చర్చించారు. యాసంగి ధాన్యం కొనుగోళ్లను అనేక సవాళ్ల మధ్య విజయవంతంగా నిర్వహిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని ఈ సందర్భంగా భట్టి విక్రమార్క అభినందించారు. ప్రజా ప్రభుత్వ పాలనలో రైతులకు గంటల వ్యవధిలోనే ధాన్యం చెల్లింపులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. రైతులు ఇబ్బందులు పడకుండా కొనుగోలు ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. మే నెలాఖరు నాటికి రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లు వంద శాతం పూర్తి చేయాలని సమావేశంలో అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. తేమ శాతం, రవాణా, చెల్లింపుల వంటి అంశాల్లో ఆలస్యం జరగకుండా ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ఇటీవల రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిన సన్‌ఫ్లవర్ పంట కొనుగోళ్లకు తక్షణమే అవసరమైన ఏర్పాట్లు చేయాలని సమావేశంలో సూచించారు. రైతులకు గిట్టుబాటు ధర లభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు. వ్యవసాయ రంగానికి ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వాయు కాలుష్య నియంత్రణలో భాగంగా గ్రామాల్లో రైతులు పంట అవశేషాలను, ముఖ్యంగా వరి కొయ్యలను కాల్చకుండా విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. రాబోయే 15 నుంచి 30 రోజుల పాటు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి పంట అవశేషాలను కాల్చితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధి విషయంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని అధికారులు తెలిపారు. కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని సమావేశంలో నిర్ణయించారు.

## పూర్వ విద్యార్థుల, ఉపాధ్యాయుల కలుక



**నల్లచెరువు, మే 25 (జర్నలిస్ట్ ఫైల్) :** నల్లచెరువులో చదువుకున్న పాఠశాలను వీడి 14 ఏళ్లు గడిచినా జ్ఞాపకాలు చెదరలేదు. అప్యాయతలు తరగలేదు నల్లచెరువు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2011... 2012 పదో తరగతి విద్యార్థుల పూర్వ సమ్మేళనం ఆదివారం జరిగింది. 14 ఏళ్ళు తరువాత పాఠశాలకు చేరుకున్న పూర్వ విద్యార్థులంతా ఒకరినొకరు చూసుకుంటూ గుర్తు పడుతూ వారి మధురానుభూతులను స్మరించుకున్నారు. పూర్వ విద్యార్థులు అనంతరం ఆటలు, పాటలుతో అదరగొట్టడంతో పాటు సహపంక్తి భోజనం నిర్వహించారు. పూర్వం చదువుకొని ఉన్నతస్థాయిలో ఉన్న పూర్వవిద్యార్థులు పాఠశాలకు గ్రంథాలయం ఏర్పాటు చేయడానికి టేబుల్, పుస్తకాలు, కూర్చీలు, పంకాలతో అందజేశారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వాదులపల్లి షఫీ, విశ్వనాథ్, జంషీర్,ప్రేమ్ నాథ్, శ్రీకాంత్ రెడ్డి, జయరాం, నిలకంఠ,విశ్వనాథ్ రెడ్డి,. మస్తాన్బి.విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

## వాల్మీకి ఓట్లతో గెలిసిన ప్రతినాయకుడు వాల్మీకుల ఎస్టీ పునరుద్దరనపై

**-బాధ్యత తీసుకోవాల్సిందే**



**నంద్యాల, మే 25 (జర్నలిస్ట్ ఫైల్) :** ఎన్నికల ముందు హామీ ఇచ్చినప్రకారం ర్ పునరుద్దరణ కేంద్రంతో మాట్లాడి చేయించాలసిన రాష్ట్రప్రభుత్వం రెండు సంవత్సరాలుగా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహారిస్తుందని, అనేకపర్యాయలు ముఖ్యమంత్రిగారిని కలిసిన చేస్తాం, చూస్తాం అంటున్నారే కానీ ఆచరణ మాత్రం శూన్యంగా కనపడుతుందని, మళ్ళీ రేపు రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో కులాన్ని నమ్మించేందుకు కొత్త ఎత్తుగడ లతో రానున్నదని యువత అప్రమత్తతతో ఉండాల్సిన అవసరం ఉందని ఈ రోజు ఎంవీఆర్పియిస్ యూత్ విభాగం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఎంవీఆర్పియిస్ రాష్ట్ర అధ్యక్షులు బోయ పులికొండన్న, న్యాయసలహాదారులు లాయర్ సుబ్బారాయుడు, యూత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శివ నాగేంద్ర, యూత్ జిల్లా ఉపాధ్యక్షులు పరమేశలు యువతకు దిశ నిర్దేశం చేశారు. ఈ సందర్బంగా నేతలు మాట్లాడుతూ 2017లో అసెంబ్లీలో తీర్మానం చేసిన ఇప్పుడున్న ముఖ్యమంత్రిగారే తమ అభిప్రాయాన్ని కేంద్రానికి వివరించి పార్లమెంట్లో ఆమోదం పొందేలా చూడాలి కానీ ఎమ్మెల్యే లు అసెంబ్లీలో, ఎంపీ లు పార్లమెంట్లో మాట్లాడినా చలనం లేకుండా పోయిందని స్థానిక సంస్థల ఎన్నికల నాటికీ వాల్మీకుల ఎస్టీ పునరుద్దరణ పార్లమెంట్లో ఆమోదం పొందేలా వాల్మీకుల ఓట్లతో గెలిచిన నాయకులందరు కృషి చెయ్యాలని లేని పక్షంలో అందుకు మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో యూత్ నేతలు శ్రీనివాసులు, రవి,సాయి, నగేష్, మహేష్, సుబ్రహ్మణ్యం, మధు, గణేష్, అర్జున్, మంజునాథ్, రవి, రాజు తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ యశోదను ఘనంగా సన్మానించిన కురువ సంఘం కమిటీ పెద్దలు



**నంద్యాల, మే 25 (జర్నలిస్ట్ ఫైల్) :** నంద్యాల మండలం బిల్లలాపురం గ్రామానికి రాష్ట్ర కురువ సంఘం ఉపాధ్యక్షుడు సంకల శ్రీరాములు కుమార్తె డాక్టర్ యశోదను బిల్లలాపురం గ్రామ పెద్దలు, కమిటీ పెద్దలు సభ్యులు వైసిపి సీనియర్ నాయకులు, ఘనంగా సన్మానించిన సన్మానించారు.

## శిల్పారామంలో ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు



**(జర్నలిస్ట్ ఫైల్) , శేరిలింగంపల్లి:** శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం జరిగిన నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ముందుగా ఉదయ్ కృష్ణ శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలో మూషిక వాహన, తాండవ నృత్యకారి, నామరామాయణం, ఒకపరి కొకపరి, రామాయణశబ్దం తదితర అంశాలను ఐశ్వర్య, తన్వి, ఆధ్య, మహీరా, శ్రీనిక, జొశ్విక, దేదీప్య తదితరులు ప్రదర్శించి మెప్పించారు. ఆ తర్వాత బెంగళూరు నుంచి విచ్చేసిన నృత్యరంజని ఫైన్ ఆర్ట్స్ అకాడమీ గురువు శాంత కృష్ణ ఆధ్వర్యంలో అమూల్య, రిషిత, సహస్ర, శ్రితి, శ్రావ్య, బృంద, భవ్య తదితరులు ప్రదర్శించిన 'రామచరితం' భరతనాట్య నృత్య రూపకం విశేషంగా అలరించింది. ఈ కార్యక్రమానికి నందకుమార్ గాత్రం, కృష్ణ బాత్ వేణువు, కార్తీక్ మృదంగం, శ్రీకాంత్ రిథమ్ ప్యాడ్‌పై అద్భుతమైన సంగీత సహకారం అందించారు

## లక్ష్మారెడ్డిపాలెంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి.. దర్యాప్తు చేపట్టిన పోలీసులు




**హయత్‌నగర్, మే 25 (జర్నలిస్ట్ ఫైల్) :** హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కలకలం రేపింది. లక్ష్మారెడ్డిపాలెం ప్రాంతంలో సాయి కట్టర్ కాలనీ కమాన్ సమీపంలో గుర్తు తెలియని పురుషుడి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. ఆదివారం మధ్యాహ్నం సుమారు 3 గంటల 15 నిమిషాల సమయంలో లక్ష్మారెడ్డిపాలెం పరిధిలోని సాయి కట్టర్ కాలనీ కమాన్ సమీపంలో సుమారు 35 నుంచి 40 సంవత్సరాల వయస్సు గల గుర్తు తెలియని పురుషుడి మృతదేహం లభ్యమైంది. స్థానికుల సమాచారంతో ఘటనాస్థలికి చేరుకున్న హయత్‌నగర్ పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. ప్రాథమిక సమాచారం మేరకు ఆ వ్యక్తి ఆహారం మరియు నీరు అందక మృతి చెందినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అనంతరం మృతదేహాన్ని భద్రపరచడం మరియు పోస్టుమార్టం నిర్వహణ నిమిత్తం ఉస్మానియా జనరల్ హాస్పిటల్‌కు తరలించారు. మృతుడి పూర్తి వివరాలు ఇంకా తెలియరాలేదని పోలీసులు తెలిపారు. ఎవరైనా మృతుడిని గుర్తించినా లేదా సంబంధిత సమాచారం తెలిసినా వెంటనే హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు కోరుతున్నారు. గుర్తుతెలియని వ్యక్తి మృతిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు

## వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలి



○ తగు జాగ్రత్తలతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి: డాక్టర్ నక్కా సుశాన్ గ్రేస్

**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్):** జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని నందులపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి డాక్టర్ నక్కా సుశాన్ గ్రేస్ సూచించారు. రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ హెచ్చరికల మేరకు ఉష్ణోగ్రతలు 40 నుండి 50 డిగ్రీల వరకు పెరిగే అవకాశముందని తెలిపారు.

వడదెబ్బ కారణంగా అధిక జ్వరం, తలనొప్పి, తల తిరగడం, చెమటలు ఆగిపోవడం, వాంతులు, మూర్ఛ వంటి లక్షణాలు కనిపిస్తాయని చెప్పారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 4 గంటల వరకు అవసరం లేకుండా బయట తిరగవద్దని సూచించారు. తగినంత నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు, పళ్ల రసాలు, ఓఆర్ఎస్ ద్రావణాలు ఎక్కువగా తీసుకోవాలని తెలిపారు. తేలికపాటి ఆహారం తీసుకోవడంతో పాటు పలుచటి, తెల్లటి దుస్తులు ధరించాలని సూచించారు. బయటకు వెళ్లేటప్పుడు గొడుగు, టోపీ ఉపయోగించడంతో పాటు కళ్లకు నల్లటి అద్దాలు ధరించాలని చెప్పారు. చెవుల్లోకి వేడిగాలి వెళ్లకుండా జాగ్రత్త పడాలని సూచించారు. పిల్లలు, వృద్ధులు, గర్భిణీలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. గుండె జబ్బులు, మధుమేహం, రక్తపోటుతో బాధపడేవారు ఎండలో తిరగరాదని హెచ్చరించారు.

వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే వెంటనే బాధితులను చల్లని ప్రదేశానికి తరలించి, చల్లటి నీటితో శరీరాన్ని తుడవాలని, సమీప ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించారు. రోజుకు కనీసం నాలుగు నుండి ఐదు లీటర్ల నీరు తాగాలని తెలిపారు.

పట్టణ ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించి, ముందు జాగ్రత్త చర్యగా ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో యూఎల్బీ సబ్ యూనిట్ ఆఫీసర్ అందె బాలచంద్రమౌళి, సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, హెల్త్ విజిటర్ ప్రసన్న పుష్పలత, ఫార్మసిస్ట్ ఎ. శిరీష, స్టాఫ్ నర్సులు వి. సునీత, ఎం. అరుణ, ల్యాబ్ టెక్నీషియన్ ధనలక్ష్మి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

## స్కూల్ బస్సుల తనిఖీలు పూర్తి

○ భద్రతా ప్రమాణాలు లేని 187 వాహనాలకు నోటీసులు

**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్):** జిల్లాలో స్కూల్, కాలేజీ బస్సుల భద్రతా ప్రమాణాల తనిఖీల్లో భాగంగా 565 బస్సులను పరిశీలించినట్లు ఉప రవాణా కమిషనర్ కె. సీతారామిరెడ్డి తెలిపారు. భద్రతా ప్రమాణాలు పాటించని 187 వాహనాలకు నోటీసులు జారీ చేసినట్లు వెల్లడించారు.

సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని అన్ని పాఠశాలలు, కళాశాలల బస్సులను మోటారు వాహన తనిఖీ అధికారులు పరిశీలిస్తున్నారని తెలిపారు. బస్సులు రహదారులపై సురక్షితంగా ప్రయాణించడానికి అనుకూలంగా ఉన్నాయా లేదా అన్న అంశంపై తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

తనిఖీల్లో గుర్తించిన లోపాలను వెంటనే సరిచేసి బస్సులను సిద్ధం చేసుకోవాలని విద్యాసంస్థల యాజమాన్యాలకు సూచించినట్లు తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని హెచ్చరించారు. ఆటోమేటెడ్ ఫిట్నెస్ సెంటర్ల వద్ద వాహనాల ఫిట్నెస్ సర్టిఫికెట్లు పొందాలని సూచించారు.

## మెగా జాబ్ మేళాకు విశేష స్పందన



**బ్రహ్మంగారిమఠం( జర్నలిస్ట్ ఫైల్ ):** బ్రహ్మంగారిమఠంలోని స్థానిక శ్రీ వీరబ్రహ్మేంద్ర జూనియర్ కళాశాల నందు సోమవారం నాడు నిర్వహించిన మెగా జాబ్ మేళాకు నిరుద్యోగుల నుండి విశేష స్పందన లభించినట్లు ప్రిన్సిపల్ ముండ్లపాటి చంద్రశేఖర్ స్కిల్ డెవలప్మెంట్ ప్లేస్మెంట్ ఆఫీసర్ పెంచలయ్య తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప నగరంలోని కొప్పర్తి ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఛానల్ పే కంపెనీ వారు ద్వారా కళాశాలలో జాబ్ మేళా నిర్వహించడం జరిగిందని ఈ జాబ్ మేళాకు మండల వ్యాప్తంగా ఉన్న నిరుద్యోగ యువతీ యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు 109 మంది నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొనగా వారిలో 86 మంది అర్హత సాధించారని వారికి త్వరలోనే నియామక పత్రాలను అందజేసి ఉద్యోగాన్ని కల్పిస్తామని ఉద్యోగం పొందిన వారికి ఆకర్షణీయమైన జీతంతో పాటు ఉచిత భోజన, రవాణా, వసతి సౌకర్యం కల్పిస్తామని వారు తెలిపారు అంతేకాకుండా కళాశాల ప్రిన్సిపల్ ఆధ్వర్యంలో ఇకమీదట ప్రతినెల ఈ ప్రాంతంలోని నిరుద్యోగ యువతీ యువకులను దృష్టిలో ఉంచుకొని జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని ఇందులో సాఫ్ట్వేర్ కు సంబంధించిన జాబ్ అలాగే హార్డ్వేర్ మరియు మరియు టెక్స్టైల్ వంటి కంపెనీల ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు తమ సంస్థ ద్వారా కృషి చేస్తామని ప్రభుత్వం నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పించాలని లక్ష్యంతో ఈ జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు బాలసుబ్బయ్య కంపెనీ సిబ్బంది చంద్ర నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొన్నారు

## బక్రీద్ రోజున గోవధ జరగరాదు : కలెక్టర్ సాయి కాంత్ వర్మ

○ అనధికార జంతు వధపై కఠిన చర్యలు



**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్):** బక్రీద్ పండుగ సందర్భంగా గోవధ జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సి.యం. సాయి కాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. గోవధ నిషేధం, జంతు వధ నివారణ చట్టం అమలుపై సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధీకృత స్థలాలు మినహా ఇతర ప్రాంతాల్లో జంతు వధకు అనుమతి లేదని స్పష్టం చేశారు. గోవులను వధించరాదని, అధికారికంగా ధృవీకరించిన గొర్రెలు, మేకలను మాత్రమే నిబంధనల మేరకు వధించేందుకు అనుమతిస్తామని తెలిపారు. అధికారికంగా గుర్తింపు పొందిన జంతు వధశాలల్లో మాత్రమే అనుమతించిన జంతువుల వధ జరగాలని ఆదేశించారు.

తాత్కాలిక జంతు వధశాలలకు దరఖాస్తు చేసిన వారికి నిబంధనల ప్రకారం అనుమతులు మంజూరు చేయాలని సూచించారు. మున్సిపల్, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల సమన్వయంతో తాత్కాలిక వధశాలల ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. పర్యావరణ అనుమతుల మేరకు పారిశుధ్య కార్యక్రమాలు పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు.

జంతు రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టాలని, ఆరు చెక్పోస్టుల ద్వారా పర్యవేక్షణ నిర్వహిస్తున్నామని తెలిపారు. రవాణా శాఖ కూడా పశువుల రవాణాపై నిఘా పెట్టాలని సూచించారు.

**సోషల్ మీడియాలో వదంతులపై నిఘా**

సామాజిక మాధ్యమాల్లో వదంతులు సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. సోషల్ మీడియాలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని పోలీసు శాఖను ఆదేశించారు. ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు అనుమానాస్పద సమాచారం ఉంటే అధికారులకు తెలియజేయాలని కోరారు.

పోలీస్ సూపరింటెండెంట్ వకుల్ జిందాల్ మాట్లాడుతూ బక్రీద్ రోజున గోవధ జరగకుండా అన్ని చర్యలు చేపట్టామని తెలిపారు. డ్రోన్ల ద్వారా పర్యవేక్షణ నిర్వహిస్తామని, సున్నిత ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు కె.వి.వి. సత్యనారాయణ మాట్లాడుతూ మూడు సంవత్సరాల లోపు వయస్సు గల ఎద్దులను వధించరాదని తెలిపారు. గర్భిణీ జంతువులు, ఒంటెల వధ పూర్తిగా నిషేధమని చెప్పారు.

ఈ సమావేశంలో నగరపాలక సంస్థ కమిషనర్ కె. మయూర్ అశోక్, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, తెనాలి ఇన్చార్జి సబ్ కలెక్టర్ లక్ష్మీకుమారి, ఆర్డీవో కె. శ్రీనివాసరావు, జిల్లా పరిషత్ సీఈఓ వి. జ్యోతి బసు, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి పార్థసారథి, ఉప రవాణా కమిషనర్ కె. సీతారామిరెడ్డి, డీఎస్పీలు అజీజ్, శ్రీనివాస్, కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజనీర్ ఎం.డి. నజీనా బేగం, గో సంరక్షణ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల సంక్షేమానికి లేబర్ అడ్డా ఎంతో ఉపయోగకరం

○ ప్రతి కార్మికుడు సద్వినియోగం చేసుకోవాలి : జీఎంసీ కమిషనర్ కె. మయూర్ అశోక్



**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్):** నగరంలో ఏర్పాటు చేస్తున్న లేబర్ అడ్డా (ఇంటిగ్రేటెడ్ లేబర్ ఆమెనిటీస్ కాంప్లెక్స్) కార్మికుల సంక్షేమానికి ఎంతో దోహదపడుతుందని, ప్రతి కార్మికుడు దీనిని సద్వినియోగం చేసుకోవాలని నగర పాలక సంస్థ కమిషనర్ కె. మయూర్ అశోక్ అన్నారు.

సోమవారం గుంటూరు నగరంలోని పట్టాభిపురం వద్ద నగర పాలక సంస్థ మరియు కార్మిక శాఖ సంయుక్తంగా ఏర్పాటు చేసిన లేబర్ అడ్డాను కమిషనర్ కార్మిక శాఖ అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించిన కమిషనర్, విద్యుత్ సౌకర్యం లేకపోవడాన్ని గమనించి వెంటనే విద్యుత్ సదుపాయం కల్పించాలని అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. సమీకృత కార్మిక సౌకర్యాల సముదాయంగా లేబర్ అడ్డాలను ఏర్పాటు చేయడం వెనుక ముఖ్య ఉద్దేశ్యం కార్మికులకు సురక్షితమైన వాతావరణంలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడమేనని తెలిపారు. పనుల కోసం రోడ్లపై వేచి ఉండాల్సిన పరిస్థితి లేకుండా, కార్మికులు లేబర్ అడ్డాలలోనే వేచి ఉండేందుకు అవసరమైన అన్ని సదుపాయాలు అందుబాటులో ఉంచుతున్నామని చెప్పారు.

లేబర్ అడ్డాలలో రక్షిత తాగునీరు, ప్రథమ చికిత్స, మహిళలు మరియు పురుషులకు వేర్వేరుగా మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా కార్మికుల నూరుశాతం క్రమబద్ధీకరణ కోసం ఆధార్, బ్యాంకు ఖాతా, మొబైల్ అనుసంధానం, కార్మిక హక్కులు, భద్రత, ఆర్థిక అక్షరాస్యతపై నిరంతర అవగాహన కల్పించే ప్రత్యేక హెల్ప్డెస్క్లను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.

లేబర్ అడ్డాను వీలైనంత త్వరలో కార్మిక శాఖ ప్రారంభించి కార్మికులకు అందుబాటులోకి తీసుకువస్తుందని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ ఉప కమిషనర్ ఏ. గాయత్రీ దేవి, సంబంధిత అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

## మహానాడు కోసం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

○ ఏర్పాట్లను పరిశీలించిన గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్



**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్):** ఈ నెల 27, 28 తేదీలలో మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించనున్న మహానాడు కార్యక్రమానికి సంబంధించి గుంటూరు జిల్లా పోలీసులు విస్తృత భద్రతా, ట్రాఫిక్ బందోబస్తు ఏర్పాట్లు చేపట్టారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రివర్గ సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు, భారీ సంఖ్యలో కార్యకర్తలు హాజరుకానున్న నేపథ్యంలో భద్రతా చర్యలను మరింత పటిష్టం చేస్తున్నారు.

ఈ నేపథ్యంలో గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, జిల్లా అదనపు ఎస్పీ (లా అండ్ ఆర్డర్) ఏటీవీ రవికుమార్, ఇతర అధికారులతో కలిసి సోమవారం మహానాడు వేదికను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమ ప్రాంగణం, ప్రవేశ మరియు నిష్క్రమణ మార్గాలు, వాహనాల పార్కింగ్ ప్రాంతాలు, వీవీఐపీ రూట్లు, భద్రతా తనిఖీ కేంద్రాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

కార్యక్రమ ప్రాంగణంలోకి ప్రవేశించే ప్రతి వ్యక్తికి క్షుణ్ణమైన తనిఖీలు నిర్వహించాలని, గుర్తింపు కార్డులు ఉన్నవారినే అనుమతించాలని ఆదేశించారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులపై నిరంతర నిఘా ఉంచాలని, వీవీఐపీ, వీఐపీ రాకపోకల సమయంలో ఎటువంటి అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యేక బృందాలను సిద్ధంగా ఉంచాలని తెలిపారు.

ట్రాఫిక్ రద్దీ నివారణ కోసం ప్రత్యేక పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేయాలని, వాహనాలను కేటాయించిన ప్రాంతాల్లోనే నిలిపివేయించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన చోట్ల ట్రాఫిక్ మళ్లింపులు అమలు చేయనున్నట్లు తెలిపారు.

మహానాడు కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ పూర్తి స్థాయిలో అప్రమత్తంగా పనిచేస్తోందని, ప్రజలు మరియు కార్యకర్తలు పోలీసులకు సహకరించాలని ఎస్పీ కోరారు.

ఈ పరిశీలన కార్యక్రమంలో నార్త్ డీఎస్పీ మురళీకృష్ణ, ఎస్బీ డీఎస్పీ అలహరి శ్రీనివాస్, ఎస్బీ సీఐ–1 మల్లిఖార్జునరావు, మంగళగిరి రూరల్ సీఐ ఏవీ బ్రహ్మం, ఎస్సై చిరుమామిళ్ల వెంకట్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలను వెంటనే తగించాలి



**తెనాలి (జర్నలిస్ట్ ఫైల్):** కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలను వెంటనే తగించాలని కాంగ్రెస్ పార్టీ తెనాలి నియోజవర్గ ఇన్చార్జి డాక్టర్ చందు సాంబశివుడు పేర్కొన్నారు. పట్టణంలో కాంగ్రెస్ పార్టీ మరియు సిపిఎం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలను తగ్గించాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చందు సాంబశివుడు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నారని, ఎన్నికలకు ముందు పెట్రోల్ డీజిల్ ధరలు పెంచమని చెప్పి కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం భారీ స్థాయిలో పెట్రోల్, డీజిల్ ధరలు పెంచారని ఆయన విమర్శించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వలన అన్ని వర్గాల ప్రజలు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్లు ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు బాబు ప్రసాద్ ఊసేన్ వలి తెనాలి టౌన్ ప్రెసిడెంట్ పొన్నూరు నాగ సూర్య శేశి ధర్, గుంటూరు జిల్లా జెనరల్ సెక్రటరీ యన్నం శెట్టి శివరామకృష్ణ ప్రసాద్, మీడియా కోఆర్డినేటర్ మాదల పూర్ణచంద్రావు,మాజీ తెనాలి బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సోలా శంకర్, పి శివకుమార్, భీమా రమేష్, పి స్టీవెన్ బాబు, వై శంకర్ కే కోటేశ్వరరావు,యస్ సుబ్బారావు షేక్ నాగూర్, పి కార్తీక్, అఖిల్, పూలేరామ్,బి శ్రీను ఎన్ మల్లిఖార్జున రావు తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ దుష్ప్రచారాలను ప్రజలు నమ్మొద్దు : ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

○ జూన్ 12 నాటికే పాఠ్యపుస్తకాలు, నోట్బుక్స్ పంపిణీ



**వినుకొండ (జర్నలిస్ట్ ఫైల్):** కూటమి ప్రభుత్వంపై వైసీపీ చేస్తున్న అసత్య ఆరోపణలను, సోషల్ మీడియా దుష్ప్రచారాలను ప్రజలెవరూ నమ్మవద్దని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు పిలుపునిచ్చారు. ముఖ్యంగా విద్యార్థుల స్కూల్ కిట్ల ('సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర' కిట్లు) పంపిణీ విషయంలో వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని ఆయన ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. అధికారం కోల్పోయిన నాటి నుంచి జగన్ మోహన్ రెడ్డి, ఆయన పార్టీ నాయకులు తప్పుడు కథనాలతో ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూస్తున్నారని మండిపడ్డారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం రాష్ట్ర పునర్నిర్మాణానికి, సంక్షేమానికి పెద్దపీట వేస్తుంటే... అది చూసి ఓర్వలేక వైసీపీ నేతలు స్కూల్ కిట్లపై కావాలనే కుట్రపూరిత ప్రచారం చేస్తున్నారని జీవీ ఆంజనేయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతర్జాతీయంగా నెలకొన్న యుద్ధ వాతావరణం, ముడి చమురు, గ్యాస్ కొరత కారణంగా స్కూల్ కిట్లకు సంబంధించిన ముడిసరుకుల రవాణాకు అంతరాయం ఏర్పడిందని ఆయన వివరించారు. దీనివల్ల యూనిఫాం, బూట్లు, బ్యాగుల తయారీకి అవసరమైన ఫైబర్, ఇతర మెటీరియల్స్ ధరలు పెరగడంతో పాటు సరఫరాలో కొంత అంతర్జాతీయంగా ఆలస్యం జరిగిందని, అంతేకానీ కిట్ల పంపిణీని ప్రభుత్వం ఎక్కడా రద్దు చేయలేదని స్పష్టం చేశారు. గత వైసీపీ ప్రభుత్వం టెండర్ల ప్రక్రియలో చేసిన అవినీతి, నాణ్యతా లోపాలను సరిదిద్ది, విద్యార్థులకు అత్యంత నాణ్యమైన వస్తువులను అందించాలనే సంకల్పంతో కూటమి ప్రభుత్వం అన్నింటినీ పునఃసమీక్షించిందని తెలిపారు.

జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికే విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలు, నోట్బుక్స్ పక్కాగా అందుతాయని, మిగిలిన యూనిఫాం, బూట్లు, బ్యాగులను కూడా వీలైనంత త్వరగా పంపిణీ చేసేందుకు అధికారులు తయారీ సంస్థలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారని వెల్లడించారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ధ్వంసమైన వ్యవస్థలను తాము ఇప్పుడిప్పుడే దారిలోకి తెస్తుంటే, దానిని కూడా రాజకీయం చేయడం జగన్ వంకరబుద్ధికి నిదర్శనమని, ఆయన ఆలోచనలన్నీ ఎప్పుడూ వంకర మార్గంలోనే ఉంటాయని విమర్శించారు. సోషల్ మీడియా వేదికగా వైసీపీ పెయిడ్ ఆర్టిస్టులు సృష్టిస్తున్న ఫేక్ న్యూస్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరిన ఆయన, ఐదేళ్లపాటు రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన వైసీపీకి ప్రభుత్వంపై విమర్శలు చేసే నైతిక అర్హత లేదన్నారు. జగన్ అండ్ కో ఎన్ని అబద్ధాలు ప్రచారం చేసినా తమ ప్రభుత్వం చేస్తున్న మంచి పనులే వారికి సమాధానం చెబుతాయని, తప్పుడు ప్రచారాలతో

## వివిఐటియూలో "సమ్మర్ ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ప్రోగ్రామ్" ప్రారంభం



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ):** విద్యార్థులకు ప్రస్తుత పారిశ్రామిక రంగానికి అవసరమైన నైపుణ్యాలను అందించడమే ధ్యేయంగా వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నలాజికల్ యూనివర్సిటీ నందు ఎస్ఎస్ఐటి సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో "సమ్మర్ ఇండస్ట్రియల్ ట్రైనింగ్ మరియు ఇంటర్న్షిప్ ప్రోగ్రామ్ 2026" శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు వీవీఐటీయూ ప్రో–ఛాన్సలర్ వాసిరెడ్డి మహదేవ్ తెలిపారు. వారం రోజుల పాటు జరగనున్న ఈ శిక్షణా తరగతులకు రెండు తెలుగు రాష్ట్రాల నుండి 210 మంది విద్యార్థులతో పాటు పలు ట్రిపుల్ ఐటీ విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. ఈ శిక్షణా శిబిరంలో ఇంజనీరింగ్ మరియు టెక్నికల్ విద్యార్థులకు సాఫ్ట్వేర్, ఐటీ పరిశ్రమలకు అవసరమైన ఎంబెడెడ్ సిస్టమ్స్, ఐఓటీ, వీఎల్ఎస్ఐ వంటి అధునాతన నైపుణ్యాలపై శిక్షణ అందిస్తారని తెలిపారు. కంపెనీలలో రియల్ టైమ్లో పని ఏ విధంగా ఉంటుందో లైవ్ ప్రాజెక్ట్ ద్వారా నేర్పిస్తారని పేర్కొన్నారు. వివిధ పారిశ్రామిక ప్రతినిధులచే విద్యార్థులకు సదస్సులు నిర్వహించడంతో పాటు ఈ శిక్షణ అనంతరం ఇంటర్న్షిప్ సర్టిఫికేట్ అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీవీఐటీ రిజిస్ట్రార్ డా॥ వై. మల్లికార్జునరెడ్డి, ఎస్ఎస్ఐటి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ చోడిశెట్టి సూర్యత్రినాథ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## పి.జి.ఆర్.ఎస్కు 444 అర్జీలు



**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్):** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్) లో 444 అర్జీలు అందాయి. సోమవారం ఎస్ ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ సి. యం. సాయి కాంత్ వర్మ ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. వయోవృద్ధులు, దివ్యాంగుల వద్దకు నేరుగా వెళ్లి అర్జీలు స్వీకరించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారు సంతృప్తి మేరకు పరిష్కారం కావాలని, సంబంధిత శాఖల అధికారులు దృష్టి సారించాలని ఆదేశించారు. అర్జీలు పరిష్కారంలో ఎటువంటి అలసత్వం ఉండరాదని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

జిల్లాలో పి.జి.ఆర్.ఎస్ కు మొత్తం 444 అర్జీలు అందాయి. అందులో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన పి.జి.ఆర్.ఎస్ కు 215, పోలీస్ సూపరింటెండెంట్ కార్యాలయంలో జరిగిన పి.జి.ఆర్.ఎస్ కు 148 అర్జీలు, గుంటూరు రెవిన్యూ డివిజన్ పరిధిలో 5 అర్జీలు, తెనాలి రెవిన్యూ డివిజన్ పరిధిలో 26 అర్జీలు, గుంటూరు నగర పాలక సంస్థకు 45, మిగిలిన మున్సిపాలిటీల పరిధిలో 5 అర్జీలు అందాయి.

అర్జీదారులు పింఛన్లు, రేషన్ కార్డులు, గృహాలు మంజూరు చేయాలని, భూ సమస్యలు, వ్యక్తిగత సమస్యల పరిష్కారం చేయాలని కోరుతూ ఆర్జీలను సమర్పించారు.

ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, డిప్యూటీ కలెక్టర్ గంగ రాజు, జిల్లా అటవీ అధికారి ఎం.హిమ శైలజ, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.జ్యోతి బసు, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శంకర్, జిల్లా పర్యాటక అధికారి రమ్య, ముఖ్య ప్రణాళిక అధికారి పి.శేష శ్రీ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె విజయ లక్ష్మి, పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు కె.వి.వి సత్యనారాయణ, ఎ.పిఎం.ఐ.పి ఎల్. వజ్రశ్రీ, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి.విజయ లక్ష్మి, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎం.పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

## ఏడుగురికి కారుణ్య నియామక పత్రాలు అందజేసిన కలెక్టర్



**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్):** కారుణ్య నియామకాలు క్రింద ఏడుగురు అభ్యర్థులకు జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ నియామక పత్రాలను జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం అందజేశారు. వివిధ శాఖలలో వారికి నియామకాలు చేస్తూ ఆ మేరకు నియామక పత్రాలను అందజేశారు. ఉద్యోగ ధర్మాన్ని అంకితభావంతో నిర్వర్తించి మంచి ఉద్యోగులుగా గుర్తింపు పొందాలని ఈ సందర్భంగా కలెక్టర్ అన్నారు. వృత్తి ధర్మం నెరవేర్చడమే ప్రధాన ధర్మమని చెప్పారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## ఏపీ మోడల్ స్కూల్స్ పీజీటీలకు జేఎల్ పదోన్నతులు కల్పించాలి

○ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు ఎంఎస్పీటీఏ వినతి




**అమరావతి,(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలోని 164 ఏపీ మోడల్ స్కూల్స్‌లో పనిచేస్తున్న పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్లకు జూనియర్ లెక్చరర్ కేడర్ సృష్టించి జేఎల్ పదోన్నతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని మోడల్ స్కూల్స్ ప్రోగ్రెసివ్ టీచర్స్ అసోసియేషన్ (ఎంఎస్పీటీఏ) రాష్ట్ర అధ్యక్షుడు కోమటిరెడ్డి శివశంకర్ రెడ్డి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏపీ మోడల్ స్కూల్స్‌లో పదోన్నతులు పొందడానికి 10 నుంచి 15 సంవత్సరాల వరకు సమయం పడుతోందని తెలిపారు. ఇంటర్మీడియట్ విద్యను బలోపేతం చేయాలంటే 164 మోడల్ స్కూల్స్‌లో జూనియర్ లెక్చరర్ కేడర్‌ను సృష్టించడం అవసరమన్నారు. దీంతో దాదాపు 2400 మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు లభించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అదేవిధంగా, కొత్త కేడర్ ఏర్పాటు ద్వారా సుమారు 2000 పోస్టులను మెగా డీఎస్సీ ద్వారా భర్తీ చేసే అవకాశం కలుగుతుందని వివరించారు. మోడల్ స్కూల్స్‌లో 010 పద్దు కింద జీతాలు చెల్లించేలా ప్రభుత్వం జారీ చేసిన జీఓ నెం. 23ను యథాతథంగా కొనసాగించాలని కోరారు. మోడల్ స్కూల్ సొసైటీని రద్దు చేసి ప్రభుత్వ సర్వీస్ రూల్స్ అమలు చేసే దిశగా చర్యలు తీసుకోవాలని కూడా వినతిపత్రంలో కోరినట్లు తెలిపారు. ఈ అంశాలపై మంత్రి నారా లోకేష్ సానుకూలంగా స్పందించినట్లు కోమటిరెడ్డి శివశంకర్ రెడ్డి వెల్లడించారు.

## బీజేపీ ఆధ్వర్యంలో బాధ్యతాయుత జీవన విధాన ప్రచారం



○ గుంటూరు కలెక్టర్‌కు బీజేపీ నాయకుల వినతి

**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్):** బాధ్యతాయుత జీవన విధానం, పొదుపు చర్యలపై గ్రామస్థాయి నుంచి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని బీజేపీ నాయకులు గుంటూరు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు ఆధ్వర్యంలో సోమవారం జనతా వారధి కార్యక్రమం నిర్వహించారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచించిన విధంగా ఇంధన వినియోగాన్ని తగ్గించుకోవడం, బంగారం కొనుగోళ్లను తగ్గించడం, అవసరం లేని విదేశీ ప్రయాణాలను ఏడాది పాటు నివారించడం, వర్క్ ఫ్రం హోం విధానాన్ని ప్రోత్సహించడం వంటి అంశాలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని కోరారు. దేశ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం కావాలంటే ప్రతి ఒక్కరూ మితవ్యయ జీవన విధానాన్ని అలవర్చుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

గ్రామ సభలు, పొదుపు మహిళా సంఘాలు, స్వయం సహాయక బృందాల ద్వారా ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని సూచించారు. గ్రామ స్థాయిలో పోస్టర్లు, బ్యానర్లు, డిజిటల్ మీడియా ద్వారా నిరంతర ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.

ఈ కార్యక్రమంలో జనతా వారధి కన్వీనర్ షేక్ సాంబశివరావు, ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంతేటి బ్రహ్మయ్య, కొక్కెర శ్రీనివాస్ యాదవ్, పల్నాడు జిల్లా ఇన్‌చార్జ్, కో-కన్వీనర్ కత్తి మేరీ సరోజిని, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు శ్రీను నాయక్, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్రహం, కారుణ్య, ఆలీ తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బహిరంగ నమాజ్, జంతుబలి నిషేధం.. సీఎం యోగి కీలక ఆదేశాలు



**ఉత్తరప్రదేశ్(జర్నలిస్ట్ ఫైల్)** :దేశవ్యాప్తంగా బక్రీద్(ఈద్ అల్ అధా) వేడుకలకు సన్నాహాలు జరుగుతున్న వేళ ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడేందుకు సీఎం యోగి ఆదిత్యనాథ్ కీలక ఆదేశాలు జారీ చేశారు. బక్రీద్ సందర్భంగా బహిరంగ ప్రదేశాల్లో నమాజ్‌ల నిర్వహణ, జంతుబలిని అనుమతించబోమని స్పష్టం చేశారు.

ఈ మేరకు లఖ్‌నవూలో సోమవారం నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్లు, పోలీస్ ఉన్నతాధికారులకు సీఎం యోగి పలు సూచనలు చేశారు. ప్రార్థనలు కేవలం మసీదులు, ఈద్గాహ్‌ల పరిధిలోనే జరగాలని.. రోడ్లు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో అనుమతి ఉండదని తెలిపారు. ఒకవేళ అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యే పరిస్థితి ఉంటే షిఫ్టుల్లో నమాజ్ నిర్వహించాలని సూచించారు. అలాగే.. జంతుబలి విషయంలోనూ కఠిన నిబంధనలు అమలు చేయాలని యోగి సర్కార్ నిర్ణయించింది. బహిరంగ ప్రదేశాల్లో కుర్బానీ పూర్తిగా నిషేధమని, ప్రభుత్వం నిషేధించిన జంతువులను బలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. కుర్బానీ అనంతరం కూడా పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని, సరైన పారిశుద్ధ్య ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించింది.

బక్రీద్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు శాఖను అప్రమత్తం చేశారు సీఎం యోగి. రాష్ట్రంలోని సున్నిత ప్రాంతాలు, ఈద్గాహ్‌లు, మసీదుల వద్ద అదనపు భద్రతా బలగాలను మోహరించాలని ఆదేశించారు. సీసీటీవీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. అల్లర్లకు ప్రేరేపించే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలని పేర్కొన్నారు.

**బక్రీద్ సందర్భంగా సీఎం యోగి జారీచేసిన 10 కీలక ఆదేశాలివే..**

మసీదు ఆవరణలోనే నమాజ్ నిర్వహించాలి.
ఎట్టి పరిస్థితుల్లోనూ బహిరంగ ప్రదేశాల్లో ప్రార్థనలు చేయరాదు.
ప్రార్థనల కోసం రహదారులను అడ్డుకోకూడదు.
జనం ఎక్కువగా ఉంటే, ప్రార్థనలను విడతల వారీగా నిర్వహించాలి.
బహిరంగ ప్రదేశాలలో ఏ రూపంలోనూ జంతుబలి జరగరాదు.
నిషేధిత జంతువుల బలి పూర్తిగా నిషేధించాలి.
జంతు బలుల తర్వాత పరిశుభ్రత పాటించాలి.
అల్లర్లు సృష్టించే వారిపై అధికారులు ప్రత్యేక నిఘా ఉంచాలి.
ఈద్గాహ్‌ల వద్ద పోలీస్ బలగాలు మోహరించాలి.
సున్నితమైన ప్రాంతాలలో సీసీటీవీ కెమెరాలు, డ్రోన్‌లతో నిఘా చేపట్టాలి.

# వైకాపాను శాశ్వతంగా పాతాళానికి పంపుతాం : మంత్రి అచ్చెన్నాయుడు

○ గత వైకాపా పాలనలో కమీషన్ల కోసం పారిశ్రామికవేత్తల వేధింపు

○ రాష్ట్రంలో 23 నెలల్లో రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి

○ యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనే కూటమి ప్రభుత్వ ధ్యేయం

○ చంద్రబాబు రాష్ట్రానికి, దేశానికి రోల్ మోడల్‌గా నిలుస్తున్నారు

○ చీపుర్లపాడులో రూ. 10.51 కోట్లతో ఎంఎస్ఎంఈ పార్కుకు శంకుస్థాపన



**కోటబొమ్మాళి,(జర్నలిస్ట్ ఫైల్):** గత వైకాపా పాలనలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు వచ్చే వారిని కమీషన్ల పేరుతో వేధించి భయభ్రాంతులకు గురిచేశారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "నాకెంత.. నీకెంత" అంటూ పారిశ్రామికవేత్తలను భయపెట్టడం వల్లే వారు ఈ రాష్ట్రానికి దండం పెట్టి వెనుదిరిగారని ఆయన మండిపడ్డారు. టెక్కలి నియోజకవర్గం, కోటబొమ్మాళి మండలం చీపుర్లపాడు గ్రామ పరిధిలో సోమవారం రాష్ట్ర ప్రభుత్వం రూ. 10.51 కోట్ల వ్యయంతో, 12.22 ఎకరాల విస్తీర్ణంలో 74 ప్లాట్లతో నూతనంగా అభివృద్ధి చేయనున్న ఎంఎస్ఎంఈ పార్కుకు ఆయన శంకుస్థాపన చేశారు.

రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి ఎంఎస్ఎంఈపార్కులు విప్లవాత్మక సోపానాలుగా నిలుస్తాయని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఉద్ఘాటించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రవ్యాప్తంగా 38 పార్కులకు వర్చువల్ విధానంలో శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి అచ్చెన్నాయుడు గత ప్రభుత్వ వైఫల్యాలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

**ప్రజాస్వామ్యంలో 'గొడ్డలి పార్టీ'కి స్థానం లేదు:** ప్రజాస్వామ్యంలో 'గొడ్డలి పార్టీ'కి ఎలాంటి స్థానం లేదని, అధికారం కోసం సొంత బాబాయినే అడ్డంగా నరికేసే వారిని ప్రజలు పాతాళానికి పంపారని అన్నారు. 2019-2024 మధ్య కాలంలో గ్రామాల్లో కనీసం గుప్పెడు మట్టి కూడా పోయకుండా అభివృద్ధిని పూర్తిగా గాలికొదిలేశారని విమర్శించారు.

**యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనే ప్రథమ ప్రాధాన్యం**

ప్రతి ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేయడమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రధాన లక్ష్యమని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. అంతర్జాతీయ స్థాయిలో 'సీబీఎన్ (జదీచీ)' అంటేనే ఒక బ్రాండ్ అని, ఆయన నాయకత్వం పట్ల పెట్టుబడిదారుల్లో అపారమైన నమ్మకం ఉందన్నారు. 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానంతో పారిశ్రామికవేత్తలను విశేషంగా ఆకర్షిస్తున్నామని, గూగుల్, రిలయన్స్, మిట్టల్ వంటి దిగ్గజ సంస్థలు రాష్ట్రం వైపు చూస్తున్నాయని వివరించారు. ఎన్నికల హామీ మేరకు యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించే దిశగా కూటమి ప్రభుత్వం శరవేగంగా అడుగులు వేస్తోందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**వలసల నివారణ - తాగునీటి ఎద్దడికి శాశ్వత పరిష్కారం:** శ్రీకాకుళం జిల్లాలో వలసలను అరికట్టి, యువతకు, మహిళా సంఘాలకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు మెరుగుపరచడమే ఈ ఎంఎస్ఎంఈ పార్కుల ముఖ్య ఉద్దేశమని మంత్రి పేర్కొన్నారు. స్థానిక ఉత్పత్తుల విక్రయాలకు ఇవి అద్భుత వేదికలుగా మారనున్నాయన్నారు. జిల్లా అభివృద్ధికి ప్రజలు, యువత పూర్తి సహకారం అందించాలని పిలుపునిచ్చారు. అలాగే నియోజకవర్గంలో తాగునీటి ఎద్దడికి శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం రూ. 620 కోట్లు మంజూరు చేసిందని, 2029 నాటికి ఆ ప్రాజెక్టును పూర్తి చేసి ప్రజల దాహార్తి తీరుస్తామని ఆయన హామీ ఇచ్చారు.

**జిల్లా ప్రగతికి పరిశ్రమలే ప్రాణం.. అడ్డుకునే వారిని సహించం** : మన జిల్లా అభివృద్ధి పథంలో పరుగులు పెట్టాలంటే పారిశ్రామికీకరణే మన ముందున్న ఏకైక మార్గం. పరిశ్రమలు వస్తేనే మన జిల్లా రూపురేఖలు మారతాయి. రైతన్నలు పెద్ద మనసు చేసుకుని పరిశ్రమల స్థాపనకు తమ భూములను అందిస్తే.. మన జిల్లాలోకి భారీ పెట్టుబడులు వస్తాయి. తద్వారా మన యువతకు, మన బిడ్డలకు ఇక్కడే లక్షలాది ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఉపాధి కోసం మన యువత పొట్టచేతపట్టుకుని వేరే ప్రాంతాలకు వలసపోయే దుస్థితి తప్పుతుంది. కానీ... నేడు మన జిల్లాలో జరుగుతున్న పరిస్థితులు చూస్తుంటే నా గుండె తరుక్కుపోతోంది. ఒక పక్క జిల్లాను అభివృద్ధి చేయాలని మనం అహర్నిశలు శ్రమిస్తుంటే.. అభివృద్ధిని ఓర్వలేని కొందరు స్వార్థపరులు, పరిశ్రమలు వస్తుంటే అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తున్నారు. జిల్లాలో పరిశ్రమలు నెలకొల్పేందుకు ప్రజలంతా ఏకతాటిపైకి వచ్చి సహకరించాలని ఆయన మనస్ఫూర్తిగా కోరారు.

**60 ఏళ్ల నిరీక్షణకు తెర... 2029 నాటికి నేరడి బ్యారేజీ పూర్తి** : జిల్లా ప్రజల 60 ఏళ్ల సుదీర్ఘ కలకు త్వరలోనే మోక్షం కలగనుందని, నేరడి బ్యారేజీ నిర్మాణంతో జిల్లా సస్యశ్యామలం కాబోతోందని మంత్రి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పట్టుదల, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు సహకారం వల్లే ఇది సాధ్యమైందని అన్నారు. దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న ఈ బృహత్తర ప్రాజెక్టును పూర్తి చేసే సువర్ణ అవకాశం... రాష్ట్ర మంత్రిగా తనకు, జిల్లా శాసనసభ్యులకు మరియు అధికారులకు దక్కడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. 2029 నాటికి నేరడి బ్యారేజీ నిర్మాణాన్ని వంద శాతం పూర్తి చేసి జాతికి అంకితం చేయాలన్న దృఢ నిశ్చయంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉన్నారని తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే జిల్లాలోని ప్రతి బీడు భూమికీ సాగునీరు అందుతుందని, రైతన్నలు ఏడాదికి మూడు పంటలు పండించుకుంటూ సిరులు పండించే సువర్ణ అధ్యాయానికి శ్రీకారం చుట్టబోతున్నామని మంత్రి ఉద్ఘాటించారు.

**అధికార దాహంతో ఉక్కు భూములను ఆక్రమించాలని చూసిన జగన్** : అధికార దాహం కోసం జగన్ రెడ్డి ఎవరినీ వదలరని మంత్రి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. స్వార్థం కోసం ఎవరినైనా సరే బలిచేసే నైజం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిది. ఇలాంటి విచ్ఛిన్నకర పార్టీకి మన రాష్ట్రంలో మనుగడ సాగించే అర్హత లేదు. రాబోయే రోజుల్లో ఆ పార్టీని శాశ్వతంగా పాతాళానికి తొక్కేయడం ఖాయమన్నారు. 'విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు' అన్న నినాదంతో, ఎంతో మంది అమరుల ప్రాణత్యాగాల పునాదుల మీద వెలసిన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని గత వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేయాలని చూసింది. ఉక్కు పరిశ్రమను కాపాడటం చేతకాకపోగా, దాన్ని ప్రైవేటీకరించి ఆ విలువైన భూములను సైతం ఆక్రమించుకోవాలని జగన్ అండ్ కో కుట్రలు పన్నారు. కానీ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పరిస్థితులు మారాయి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు విశాఖ ఉక్కు పరిరక్షణకు నడుంబిగించారు. కేంద్రంతో అలుపెరగని కృషి చేసి, ఉక్కు పరిశ్రమకు ఏకంగా రూ. 15 వేల కోట్లు మంజూరు చేయించారు. అంతేకాకుండా, ఆ పరిశ్రమపై పడే విద్యుత్ భారాన్ని సైతం రాష్ట్ర ప్రభుత్వమే భరించేలా చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివర ప్రసాద్, అధికారులు, తెలుగు దేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## జగన్ రాష్ట్రానికి హనీమూన్ నాయకుడు: మంత్రి రాంప్రసాద్

○ కూటమి ప్రభుత్వ అభివృద్ధిని చూసి వైసీపీ అక్కసు వెల్లగక్కుతోందని విమర్శ



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్)** : వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రాష్ట్రానికి "హనీమూన్ నాయకుడు"గా మారిపోయారని రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి విమర్శించారు. పాత సారాను కొత్త సీసాలో నింపి మార్కెటింగ్ చేసినట్లుగా జగన్ రాజకీయాలు ఉన్నాయని వ్యాఖ్యానించారు.

సోమవారం అమరావతిలో మంత్రి రాంప్రసాద్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి ఓర్వలేక జగన్ నిత్యం విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. విజయలక్ష్మి మినరల్స్‌తో ప్రారంభమైన మైనింగ్ దోపిడీ భారతీ సిమెంట్స్, సండూర్ పవర్ వరకు విస్తరించిందని అన్నారు.

దోపిడీ, బెదిరింపులు, మోసాల ద్వారా సంపాదించిన డబ్బుతో రాజకీయాల్లో ఎదిగారని విమర్శించారు. బలపనూరు నుంచి ప్రారంభమైన వైఎస్ కుటుంబ ప్రస్థానం లక్షల కోట్ల అవినీతి సామ్రాజ్యంగా మారిందని ఆరోపించారు. ప్రస్తుతం ప్రజల్లో వైఎస్ జగన్‌పై విశ్వాసం కోల్పోయిందని పేర్కొన్నారు.

జగన్‌తో పాటు వైసీపీ ఎమ్మెల్యేలంతా అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై మంచి సూచనలు చేస్తే ప్రభుత్వం వాటిని స్వీకరించేందుకు సిద్ధంగా ఉందని మంత్రి స్పష్టం చేశారు.

టీడీపీ మహానాడు ప్రారంభం రోజునే వైసీపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించడం రాజకీయ హడావుడి మాత్రమేనని ఎద్దేవా చేశారు. జగన్ నిర్వహించే ఈ కార్యక్రమం మహానాడుకు దిష్టిబొమ్మలా మారిందని మంత్రి రాంప్రసాద్ రెడ్డి వ్యాఖ్యానించారు.

## బనగానపల్లెలో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పర్యటన

○ షాదీఖానా, బైపాస్, రహదారి పనుల పరిశీలన



**నంద్యాల (జర్నలిస్ట్ ఫైల్)** :బనగానపల్లెలో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సోమవారం సుడిగాలి పర్యటన నిర్వహించి పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. మైనార్టీల కోసం నిర్మిస్తున్న నూతన షాదీఖానా నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రి, పనులను వేగవంతం చేసి అతి త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

అనంతరం అవుకుమెట్ట ప్రాంతంలో జరుగుతున్న రహదారి విస్తరణ పనులను పరిశీలించి, నాణ్యతతో పాటు నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించారు. బనగానపల్లె పట్టణంలోని పాత ఎమ్మార్వో కార్యాలయం (ప్రస్తుత ఆర్టీవో కార్యాలయం) పునరుద్ధరణ పనులను కూడా పరిశీలించిన మంత్రి, భవనం ఆధునికీకరణకు సంబంధించి అధికారులకు పలు సలహాలు, సూచనలు చేశారు.

కొండపేటలో నిర్మాణంలో ఉన్న శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవాలయ పనులను మంత్రి పర్యవేక్షించి పురోగతిపై ఆరా తీశారు. అలాగే బనగానపల్లె బైపాస్ నిర్మాణ పనులను పరిశీలించి, 2026 డిసెంబర్ నాటికి బైపాస్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని ఆదేశించారు.

# అభివృద్ధిపై తప్పుడు ప్రచారం చేస్తే తోలు తీస్తా : మంత్రి సవిత

○ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలి

○ రెండున్నరేళ్ల కూటమి అభివృద్ధి చర్చకు సిద్ధం

○ వారిలా ఎవరినీ వేధించలేదు... రౌడీ షీట్లు ఓపెన్ చేయలేదు..

○ నరుకుతామంటే ఎవరూ భయపడరు

○ వైసీపీ నాయకులకు మంత్రి సవిత హెచ్చరిక

○ నెరవేరిన 50 ఏళ్ల ఉప్పరపల్ల వాసుల కల...

○ రూ. కోటీ 60 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణం



**శ్రీసత్యసాయి (జర్నలిస్ట్ ఫైల్):** కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలో గతంలో ఎన్నడూ లేనంత అభివృద్ధి చేశాం... గ్రామాలు, పంచాయతీలు, మండలాలు, నియోజక వర్గాలు, రాష్ట్రం వారీగా ఏ స్థాయిలో అభివృద్ధిపైనైనా చర్చకు సిద్ధంగా ఉన్నాం... అభివృద్ధికి సహకరిస్తే సహృదయంతో స్వీకరిస్తాం... నోరు అదుపులో పెట్టుకోకుండా అబద్ధాలు ప్రచారం చేస్తే తోలుస్తాం... ఖబడ్దార్' అని వైసీపీ నాయకులకు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శా ఖ మంత్రి సవిత హెచ్చరించారు. వైసీపీ నాయకులకు అభివృద్ధి చేతకాక అయిదేళ్ల పాటు రాష్ట్రంలో అంధకారాన్ని నింపారన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న చూసిన ఓర్వలేకపోతున్నారన్నారు. రెండేళ్ల పాలనలో కూటమి ప్రభుత్వం అభివృద్ధితో పాటు సంక్షేమం అమలు చేస్తోందని, ప్రజలకు ఓటు అడిగే హక్కు తమకే ఉందని స్పష్టంచేశారు. కూటమి నాయకులు ఐక్యంగా పనిచేసి, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తిరుగులేని విజయాన్ని అందించి, తనకు రిటర్న్ గిఫ్ట్ ఇవ్వాలని దిశా నిర్దేశం చేశారు. రూ..కోటీ 47 లక్షలతో రొద్దం మండలం పెద్దమంతురు జిల్లా పరిషత్ హైస్కూల్ నుంచి ఎల్ తిమ్మాపురం వరకు, చెరుకూరు నుంచి ఉప్పరపల్లి గ్రామానికి మరో రూ. కోటీ 60 లక్షల రూపాయల నిధులతో బీటీ రోడ్లను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభల్లో ఆమె మాట్లాడారు. గత సాధారణ ఎన్నికల్లో తాను పూర్తి స్థాయిలో ప్రచారం చేయకపోయినా ఉప్పరపల్లి వాసులు అత్యధిక మెజార్టీ గెలిపించారన్నారు. పెద్దమంతురు, ఉప్పరపల్లి గ్రామాలకు రోడ్డు వేస్తానని ఆనాడే మాటిచ్చానని,, ఇచ్చిన మాటలకు కట్టుబడి రోడ్లు నిర్మించిన తరవాత గ్రామాలకు వచ్చానన్నారు. ఇవేకాక త్వరలో మరో మూడు రోడ్లు నిర్మించనున్నామన్నారు. రూ. 13 కోట్లతో కోగిర ఎత్తిలపోతల పథకం ప్రాజెక్టుకు భూమి పూజ చేయనున్నట్లు వెల్లడించారు. పెద్దమంతురు, ఉప్పరపల్లి గ్రామాల్లో రూ. 6.30 కోట్లతో తాగునీటి కల్పనకు ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించబోతున్నామన్నారు. ఈ రెండు గ్రామాల్లోనూ 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలోనే జరిగిందని, తరవాత వచ్చిన జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదని మంత్రి సవిత మండిపడ్డారు.

**పంచాయతీల్లో గెలుపే నాకు రిటర్న్ గిఫ్ట్..:** అభివృద్ధిని, సంక్షేమాన్ని సమపాళ్లలో సీఎం చంద్రబాబునాయుడు పరుగులు పెట్టిస్తున్నారని మంత్రి సవిత కొనియాడారు. సూపర్ సిక్స్ పథకాలతో మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, తల్లికి వందనం సహా ఎన్నో పథకాలు అమలు చేస్తున్నామన్నారు. రహదారులు, ఆసుపత్రుల నిర్మాణం, ఓవర్ హెడ్ ట్యాంకుల ఏర్పాటు చేపడుతున్నామన్నారు. ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ, సీఎం చంద్రబాబునాయుడు పాలన సాగిస్తున్నారన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటు అడిగే హక్కు కేవలం కూటమి ప్రభుత్వానికి మాత్రమే ఉందన్నారు. కూటమి నాయకులు ఐక్యం పని చేసి, స్థానిక సంస్థల్లో పసుపు జెండా ఎగురవేసి, తనకు రిటర్న్ గిఫ్ట్ ఇవ్వాలని మంత్రి సవిత దిశా నిర్దేశం చేశారు.

**నోరుజారితే తోలు తీస్తా...:** అయిదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి పనులకు నోచుకోలేదని మంత్రి సవిత మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలో గతంలో ఎన్నడూ జరగలేనంత అభివృద్ధి జరిగిందని వివరించారు. అభివృద్ధి, సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్నామన్నారు. సూపర్ సిక్స్ సహా ఎన్నో పథకాలను అర్హులకు అందజేస్తున్నామన్నారు. త్వరలో కొత్త పెన్షన్లతో పాటు ఇళ్ల నిర్మాణాలకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి చూసి వైసీపీ వలస పక్షులు, ఆ పార్టీ నేతలు సహించలేకపోతున్నారని విమర్శించారు. వారు అభివృద్ధిపై సూచనలు చేస్తే సహృదయంతో స్వీకరిస్తామని, తప్పుడు ప్రచారాలు చేస్తే మాత్రం ఊరుకునేది లేదని, తోలుస్తాం... ఖబడ్దార్ అని మంత్రి సవిత హెచ్చరించారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ ఏ స్థాయిలోనైనా అభివృద్ధిపై చర్చకు సిద్ధంగా ఉన్నామని, దమ్ముంటే రావాలని మంత్రి సవిత సవాల్ విసిరారు.

**మీలా రౌడీ షీట్లు తెరవలేదు...:** జగన్ అయిదేళ్ల పాలనలో ప్రజాస్వామ్యం అపహాస్యానికి గురైందని మంత్రి సవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఆనాడు ప్రభుత్వ వైఫల్యాన్ని నిలదీస్తే, తమపై తప్పుడు కేసులు పెట్టి వేధింపులకు పాల్పడ్డారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరవాత వైసీపీలా ఏనాడూ రాజకీయ ప్రత్యర్థులపై తప్పుడు కేసులు పెట్టడం, రౌడీ షీట్లు ఓపెన్ చేయడం వంటి దిగజారుడు చర్యలకు పాల్పడలేదన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమంటూ ఆ పార్టీ నాయకులు చేస్తున్న ధర్నాలను, ఆందోళన కార్యక్రమాలను అడ్డుకోలేదన్నారు. ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి సవిత స్పష్టంచేశారు.

**నరుకుతామంటే ఎవ్వరూ భయపడరు..:** రప్పా...రప్పా...అని నరుకుతామంటే గొడ్డలి పార్టీ నాయకులు బెదిరింపులకు ఎవరూ భయపడరని మంత్రి సవిత స్పష్టంచేశారు. రప్పా రప్పా నరికితే తప్పేంటని జగన్ అనలేదా... ఫ్లెక్సీలు పెట్టించి గొడ్డళ్లతో బెదిరింపులకు పాల్పడలేదా..? అని ప్రశ్నించారు. ఓటు అనే ఆయుధం కలిగిన ప్రజలు ఎవరికీ భయపడరన్నారు. వారు బాగు కోసం పనిచేసేవారికే ఓట్లేసి గెలిపిస్తారన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, ప్రజలకే తాము తలొగ్గుతామని, మరెవ్వరికీ భయపడే ప్రసక్తే లేదని మంత్రి సవిత తేల్చి చెప్పారు.

**నెరవేరిన 50 ఏళ్ల కల...:** రొద్దం మండలం ఉప్పరపల్లి గ్రామానికి 50 ఏళ్ల నుంచి రహదారి సౌకర్యం లేకపోవడంతో ఆ గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ వస్తున్నారు. గత సాధారణ ఎన్నికల ముందు ఎన్నికల ప్రచారానికి మంత్రి సవిత దృష్టికి ఉప్పరపల్లి గ్రామస్తులు తమ అవస్థలను వివరించారు. రహదారి సౌకర్యం లేకపోవడం వల్ల తమ బిడ్డలు విద్యకు దూరమవుతున్నారని, పండిన పంటను మార్కెట్ కు తీసుకెళ్లి విక్రయించుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. చివరికి తమ ఊరి బిడ్డలకు పిల్లనివ్వడానికి ముందుకు రావడానికి సందేహిస్తున్నారని వాపోయారు. ఉప్పరపల్లి వాసుల కష్టాలు విన్న మంత్రి సవిత... రోడ్డు నిర్మించిన తరవాతే గ్రామానికి వస్తానని ఆనాడు మాటిచ్చారు. ఇచ్చిన మాటకు కట్టుబడుతూ, బీటీ రోడ్డు నిర్మించడంపై ఆ గ్రామస్తుల ఆనందానికి అవధుల్లేకుండాపోయింది. మాట నిలబెట్టుకున్న మంత్రి సవితకు ఘన స్వాగతం పలికి తమ ఆనందాన్ని తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో స్థానికులు పాల్గొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467